ENTERED
Entered

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
నవంబర్ 28, 2010

'పాజిటివ్' పెళ్లిళ్లు

హ్యాపీబర్త్‌డే

(2010 నవంబర్ 28 నుంచి 2010 డిసెంబర్ 4 వరకు)

ఆర్. హన్సిక
1సం॥, నవంబర్-28
శ్రీలక్ష్మి-సైదులు
రాంనగర్-హైదరాబాద్

ధృవశశిర
1సం॥,నవంబర్-2009
అనీల-రమేష్
హైదరాబాద్

టి.నందు
2సం॥,నవంబర్-2008
సునీత-భాస్కర్
యల్లయ్యపాలెం-నెల్లూరు

హర్షిల్
నవంబర్
వనజ-వెంకటేష్
హైదరాబాద్

షేక్. షీమాకౌసర్
3సం॥,నవంబర్-30
జహేదా-ఖలీల్ బాషా
అశ్వారావుపేట-ఖమ్మం

పి. గణేష్
1సం॥,నవంబర్-2009
తులసి-మోహన్‌రెడ్డి
రైల్వేకాలనీ-విశాఖపట్నం

సాయి స్నేహిత్‌గౌడ్
8సం॥, నవంబర్-2002
సరిత-రామగౌడ్
కొట్లూరు-నిజామాబాద్

జి. ఐలా
8సం॥,డిసెంబర్-4
సుమిత్ర-రమణ
విశాఖపట్నం

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పెన్ను పేపర్ తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి కలర్ ఫోటో జతచేసి పోస్ట్ చేయండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1, ఎం.హెచ్ భవన్
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500 020
email- venkateshcartoon@gmail.com ph:9912354288

ENTERED

మనలో మాట

అవినీతి భారతం!

'ఇందుగలడందులేడు... ఎందెందు వెతికినా అందందే కలడు' అన్న పద్యోక్తి 'అవినీతి' విశ్వరూపం వివరించటానికి అతికినట్టు సరిపోతుంది. అడ్డగోలు సంపాదనే పరమార్థంగా పెట్టుకున్న పాలక పెద్దలు విశాల భారతాన్ని అవినీతి భారతంగా మార్చటం విషాదం. కళ్లెదుటే అవినీతీ అక్రమాలూ 'కట్టలు' తెంచుకొని ప్రవహిస్తున్నా... ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఎవరైనా కళ్లుండీ చూడలేని కబోధుల పాలనలో ఉన్నాం మనం!

కొన్నాళ్లదాకా మనకు 'దొరికితే దొంగలు... లేకుంటే దొరలు' అన్న సామెత ఉండేది. అవినీతి నేతలు ఆ దశను ఎప్పుడో దాటేసి- దొరికినా దొంగలు కాదన్నట్టు రొమ్ము విరుచుకొని, 'రాజా'ల్లా తిరుగుతున్నారు! కన్నంలో దొంగల్లా దొరికినా అడ్డగోలుగా బుకాయిస్తున్నారు. కన్నంలో ఎందుకున్నావూ? అంటే- 'అబ్బెబ్బే... గోడ నాణ్యత ఎలాగుందో పరిశీలిస్తున్నానంతే..' అని గూఢార్థాలు చెబుతున్నారు.

దేశంలో వామపక్షాలు తప్ప అన్ని పార్టీలూ జనం సొమ్ముకు చిల్లులు పెట్టినవే! తెహల్కా స్టింగ్ ఆపరేషన్లో బిజెపి పరువు టేపులకెక్కిన సంగతి తెలిసిందే! ఇప్పుడు సాగుతున్న క'ర్నా'టకం' పంకజ పార్టీలో తాజా అవినీతి అంకం మాత్రమే! దేశంలో అవినీతీ అక్రమాలకూ, బంధుప్రీతి బాజాభజంత్రీల సంస్కృతికీ అభయ'హస్తం' చూపిందీ, అధికారంతో పెంచిందీ కాంగ్రెస్ పార్టీయే! నాటి హవాలా నుంచి నేటి అన్ని దివాళా విధానాలూ హస్తం హయాంలో పురుడు పోసుకున్నవే! పార్లమెంట్లో ప్రశ్నలు అడగటానికి సైతం ప్రైవేటు సంస్థల నుంచి 'ప్రతిఫలం' పుచ్చుకునే ప్రబుద్ధులు బిజెపి, బిఎస్పీ, కాంగ్రెస్ వంటి పార్టీల్లో ఉన్నారని మరొక స్టింగ్ ఆపరేషన్లో తేటతెల్లమైంది. తాజాగా కమ్యూనికేషన్ల మంత్రి రాజా అవినీతి బాజా చెవులు చిల్లులు పడేలా మోగుతున్నా... పాలక పెద్దలు చలించటం లేదు. ఇప్పటి కొద్దిపాటి కదలికా రావటానికి సుప్రీంకోర్టు చీవాట్లు వేయాల్సి వచ్చింది! ఇంతా చేసి, అవినీతి ఆరోపణలతో మంత్రి పదవికి రాజీనామా చేసిన రాజాను ఈ మధ్య ఏదో కార్యక్రమంలో- మన నిదాన ప్రధాని జబ్బ చరిచి పలకరించారట! ఇది అవినీతికి అభినందన అనుకోవాలో... ఏమో!

మన దేశం నుంచి రోజుకు రూ.240 కోట్ల అక్రమార్జన విదేశాల్లోని బ్యాంకులకు తరలివెళుతుందట! అంటే ఏడాదికి దాదాపు 90 వేల కోట్లు! ఇది ఒక అంతర్జాతీయ సంస్థ అంచనా మాత్రమే! వాస్తవం దీనికి ఎన్ని రెట్లయినా ఉండొచ్చు! పూటకు ఇరవై రూపాయలు సంపాదించలేని పేదలు దేశవ్యాప్తంగా విలవిల్లాడుతుంటే- ఘరానా మోసగాళ్ల స్వాహాయణం నిస్సిగ్గుగా సాగిపోతోంది! ఏలినవాళ్లు గడ్డి కరుస్తూ...గుడ్డితనం నటిస్తుంటే- ఈ కుంభకోణాలకు, దోపిడీకీ అడ్డుకట్ట ఎలా పడుతుంది? మనం అవినీతి పార్టీలకు, వాటి నేతలకు చెక్ పెట్టి- జనపక్షాన నిలిచే పార్టీలకు బలం చేకూరిస్తేనే - అవినీతీ అక్రమాలకు శిక్ష! భారతానికి రక్ష!!

★

ఈ సంచికలో....

టపా	...	2
తెల్సా	...	3
కవిత్వమ్	...	6
రుచి	...	7
సీరియల్	...	8
చిన్న కథ	...	10
ఈ పేజ్	...	12
అట్టమీది కథ	...	14
కథ	...	18
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

కొత్త లోకాన్ని చూపి ..
జీవన గమనాన్నే మార్చిన ...

నిన్నటిదాకా పెన్నులమ్మే కుర్రాడు
నేడు వైద్య విద్యార్థి ... 11

తెలుసుకుందామా ... 20

సుగంధ ద్రవ్యాలు...
నౌకాయానాలు...





ఉద్వేగంతో చదివాం

కామ్రేడ్ లావు బాల గంగాధరరావు గారి ఇంటర్వ్యూ భాగాలను స్ఫూర్తిలో ప్రచురించి ఆయన్ని మాకు గుర్తుకు తెచ్చినందుకు చాలా సంతోషం. ప్రతి ఉద్యమానికి ప్రజలను చైతన్యం చేయడానికి అధ్యయనం జరగాలని ఆనాటి ఉద్యమకారులు గ్రంథాలయాల కోసం కృషి చేశారు. అటువంటివారి గురించి ఈతరం వారికి తెలియజేసినందుకు సంతోషం. అయితే ఈ కాలం వాళ్లు ఇంట్లోనే ఇంటర్నెట్‌లో తమకు కావలసింది చదువుకొంటున్నారు. ఇదంతా అభివృద్ధి చెందిన సైన్సు కారణంగా వచ్చింది. కానీ ఇది వ్యక్తి అభివృద్ధికి తోడ్పడుతుంది. ప్రజలు గ్రంథాలయాల్లో కలుసుకోవడానికి సమాజాభివృద్ధికి ఉద్యమించడానికి అడ్డుగా మారింది. పిల్లల చదువుల బాధ్యత ప్రభుత్వం వదులుకుంటున్నందున ఆ బాధ్యత తల్లిదండ్రులమీదే పడింది. పిల్లల భవిష్యత్ దృష్ట్యా పోటీతత్వం తప్పనిసరై తల్లిదండ్రులూ పిల్లలపై ఒత్తిడి తెస్తున్నారన్న విషయాన్ని చిన్న కథలో చక్కగా చెప్పారు. అక్టోబర్ విప్లవం విజయవంతమయ్యాక ఉత్తర్వులు రాయడానికి లెనిన్ ఏవిధమైన ఉద్వేగానికి గురయ్యాడా అని ఆత్రుతగా చదివాం. గొప్ప నాయకుడు, మాహామేధావి ఆ రాత్రి కొత్త ప్రపంచానికి డిక్రీ రాయడం చదివి మనస్సంతా తృప్తితో నిండిపోయింది.

ఇలిపిల్ల సూర్యనారాయణ,
భీమనవారిపేట, విజయవాడ.

జిహ్వాచాపల్యాన్ని పెంచిన అరటి రుచులు

ఈ ఆదివారం అనుబంధం మా మనస్సునెంతో హుషారైన ఆలోచనలతో పులకింపజేసి పరవశింపజేసింది. ఈ వారం 'చూద్దామా'లో 'ఎగిరే బాతులు... నేర్చుకున్న పాఠాలు' లో అక్కడి వ్యూ పాయింట్స్, సూచిపురా జలపాతం, బాణాసుర డ్యాం, ఇంకా ప్రకృతి అందాల వివరాలు చాలా ఆకర్షణీయంగా వున్నాయి. 'కవిత్వమ్'లో రేపటి పౌరులు కవితలోని సారాంశాన్ని కవి బహు సున్నితంగా వర్ణించారు. ఈ వారం 'రుచి' శీర్షికలో అరటి పువ్వుతో వివిధ రుచులు జిహ్వా చాపల్యాన్ని మరింత పెంచాయి. బర్త్‌డే చిన్నారుల ఫొటోలు ఎంతో ముద్దు గొలుపుతున్నాయి.

టి.వి.డి.ఎస్. సీతారామారావు,
విజయవాడ.

ఎగిరే తివాచీ బహు టక్కరి

ఈవారం మనలో మాట చాలా బాగా వచ్చింది. అమెరికా అధ్యక్షుడి రాక సందర్భంగా జరిగిన చిన్న సంఘటనను తీసుకొని పర్యటన వెనక దాగిన నగ్న సత్యాలను బాగా రాశారు. మామూలుగా అయితే తివాచీ ఎగరడాన్ని ఎవరూ పట్టించుకోరు. రచయిత ఆ పాయింట్‌తో మాటను చివరికంటా పొడిగించడం బావుంది.

నరసింహ, ధర్మానగూడ.

ఆకట్టుకొన్న తారాతీరం

రంగుల పేజీలో ఇచ్చిన సినీ తారల చిన్ననాటి ఫొటోలు, నేటి ఫొటోలు అలరించాయి. నవంబర్ 14 బాలల దినోత్సవం సందర్భంగా ఇలా ఇవ్వడం బావుంది. తమ తమ ఫేవరెట్ హీరోలు, హీరోయిన్ల ఫొటోలు ఇలా చూచి ఎవరైనా ఆశ్చర్యపోవలసిందే. మా పరిస్థితి దాదాపు అదే. ఇలాంటివి అంటే ప్రముఖుల అరుదైన ఫొటోలను రంగుల పేజీల్లో అప్పుడప్పుడూ ఇవ్వొచ్చుగా.

మాధవరావు, విద్యానగర్.

ఆలోచింపచేసిన ....'ఆయన కూడా...'

వికాసంలో 'ఆయన కూడా లేరు...' అనే వ్యాసం బాగా ఆలోచింపచేసింది. ఇంట్లో మగవాళ్లు లేకపోతే అదే మనసులో పెట్టుకొని అంతగా బాధపడాల్సిన అవసరం లేదని, అంత అభద్రత అవసరం లేదని చెప్పడం బావుంది. పైగా భద్రత విషయంలో మహిళలు ఎలా ఆలోచించాలో చక్కగా చెప్పారు. రచయిత చెప్పినట్లు నిజంగానే కొత్తతరం విద్యాధిక యువతులైనా ముందడుగు వేయాలి.

వై. సాంబశివరావు,
వై. సరిత, ఒంగోలు.

బాలోత్సవ్ భళా!

ఈవారం అట్టమీది కథ కొత్త

గూడెం బాలోత్సవ్ గురించి ఇచ్చినందుకు చాలా సంతోషం. పిల్లలను ప్రత్యేకంగా గుర్తుంచుకొని, వారికోసం నాలుగు పేజీలు కేటాయించడమంటే చిన్న విషయం కాదు. వారిపట్ల మీకున్న బాధ్యతకు ఇది నిదర్శనం. ఈ వ్యాసం చదువుతుంటే పిల్లలను తీసుకొని బాలోత్సవ్‌కు వెళ్లాలనిపించింది. ఇంత మంచి కార్యక్రమాన్ని వారు నిర్వహిస్తున్నారని తెలుసుకొని ఇప్పటి వరకు చాలా మిస్సయ్యామే అనుకొన్నాం. ఇక నుంచైనా పిల్లలను తీసుకొని బాలోత్సవ్‌లో పాల్గొనాలని నిర్ణయించుకొన్నాం. అయితే ఇందులో జానపదాల గురించి కూడా రాస్తే బాగుండేది. కనీసం బొమ్మల్లోనైనా స్థానం కల్పించి వుండాల్సింది.

మమత, వాసవి, హైదరాబాద్.

కథలకు ఆహ్వానం

మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో ఎన్నో సంఘటనలు మనసును మెలిపెడుతుంటాయి. అవి సామాజికమైనవి కావచ్చు. ఆర్థికమైనవి కావచ్చు. మరేవైనా కావచ్చు. వాటిని ప్రతిబింబించే... బాధితులను చైతన్యపరిచే... సామాజిక స్పృహ కలిగించే... కథలను మాకు పంపండి. ప్రచురిస్తాం. పారితోషికం వుంటుంది. అయితే తెల్లకాగితం మీద ఒకవైపు మాత్రమే రాయాలి. రాతలో ఏడు కాగితాలకు మించకూడదని మనవి.

మా చిరునామా:
కథ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.



బ్రెడ్ బొమ్మ

బ్రెడ్డును పుడ్డుగా తీసుకొంటారనే మనకు ఇంత వరకు తెలుసు. కానీ బ్రెడ్డుతో బొమ్మకూడా చేయొచ్చని తెల్సా మీకు! లారాకు ఆ విషయం బాగా తెలుసనుకుంటా. అందుకే సాదాసీదా బ్రెడ్డు ముక్కలతో బ్రహ్మాండమైన బొమ్మ చేసేశాడు. ఇదిగో ఈ బొమ్మను బన్ను ముక్కలతోనే చేశాడతను. మరి ఆ కథేంటో మూడు ముక్కల్లో చెప్పేసుకుందాం. లారా అత్తగారికి యాభయ్యవ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు చెప్పాలనుకొన్నాడు. అదీ వినూత్నంగా. అందుకే బుర్రకు పదునుపెట్టాడు. మ్యూజియం క్యురేటర్‌గా వున్న లారాకు మాంచి ఆలోచన వచ్చింది. వచ్చిందే తడవుగా 9,852 బ్రెడ్డులతో అత్తగారి బొమ్మ చేసేశాడు. అయితే అందుకు మిత్రుల సాయం కూడా తీసుకొన్నాడనుకోండి. 40 మంది స్నేహితులు, వలంటీర్లు కలిసి ఆరుగంటలపాటు కష్టపడితే ఈ బొమ్మ తయారైంది. అనుకోకుండా చేసిన ఈ బొమ్మ అతనికి గొప్ప గుర్తింపు తెచ్చిపెట్టింది. తమాషా ఏంటంటే లారా అత్తగారికి ఇష్టమైన పుడ్డు ఈ బ్రెడ్డేనంట. ఏంటో...ఒక్కోసారి అన్నీ అలా కలిసొస్తుంటాయ్! ఏమంటారు!!



తెల్సా!

పాలస్తీనా మిరపకాయ్!

అవునూ! మీరు ఘాటైన పచ్చిమిరపకాయను తినగలరా! ఏంటండీ అలా చూస్తున్నారు? అహా...తినగలరా లేదా? మా ప్రశ్నకు సమాధానం చెప్పండంతే. తినలేరుకదా. కానీ ఇదిగో ఈ 20 నెలల బుడతడు పచ్చిమిరపకాయలను లాగించేస్తాడు. నమ్మశక్యంగా లేదు కదూ. ఫొటో చూసినా అనుమాన పడడం అన్యాయమండీ బాబూ. ఈ బుడతడు పాలస్తీనాకు చెందినవాడు. తనకు 14 నెలల వయసు అప్పటినుంచి ఈ మిరపకాయలు తినే కార్యక్రమంలో పడ్డాడు. అదీ ఏడుపుమొహంతో కాదు. చక్కగా నవ్వుతూ...చాక్‌లెట్ తిన్నంత సులభంగా మిరపకాయను తినేస్తాడు. గొంతు మండిపోయే కారం వున్న మిరపకాయలను తమ బుడతడు ఈజీగా తింటున్నందుకు అతగాడి అమ్మానాన్నలు మాత్రం తెగ సంతోషపడిపోతున్నారు.



చెక్క స్కూటర్

చార్లెస్ ఆల్బర్టో పోర్చుగీసు వడ్రంగి. అతనికి ఎప్పుడూ ఒక ఆలోచన వెన్నాడుతుండేది. అదేమంటే తన నైపుణ్యాన్ని ఎలాగైనా పదిమందికీ తెలియచేయాలనుకొనేవాడు. అదే ఎలా అనేది అతని ప్రశ్న. పైగా తన పాత సామాన్ల గదిలో పడేసిన డొక్కు వెస్పా స్కూటర్ ఎప్పుడూ మదిలో మెదులుతుండేది. అంతే...ఓసారి మాంచి ఐడియా వచ్చేసింది. దాని ఫలితమే ఈ చెక్క స్కూటర్. చూశారుగా పోర్చుగీసు వీధుల్లో తను సృష్టించిన స్కూటర్ మీద ఎలా షికారు కొడుతున్నాడో! అన్నట్టు ఈ స్కూటర్‌ను తన కూతురుకు అంకితమిచ్చాడు. పైగా దానికోపేరు కూడా పెట్టాడండోయ్. ఏంటనుకొన్నారు! వెస్పా డేనియల్. బావుందా!



స్ఫూర్తి

-టి.రమేష్,
కన్వీనర్, శాస్త్రప్రచార విభాగం,
జనవిజ్ఞాన వేదిక (ఆం.ప్ర.)

కొత్త లోకాన్ని చూపి... జీవన గమనాన్నే మార్చిన...

సైన్స్ అణుబాంబులు తయారు చేయడమే మానవ వినాశనానికి కారణం కదా? ఆధునిక సాంకేతిక విజ్ఞానం రూపొందించిన యంత్రాలు అనేక వృత్తులను దెబ్బతీయడం వలన ప్రజలు ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారు కదా? విజ్ఞానశాస్త్రంలో ఎంతో ఉన్నత శిఖరాలను అధిరోహించిన అబ్దుల్‌కలాం వంటి వారే సాయిబాబాలకు వంత పాడుతున్నారు. సూరిభగవంతం వంటి శాస్త్రవేత్తలు సాయిబాబాకు గాలిలో నుండి విభూతి, గొలుసులను తీసే అతీతశక్తులు ఉన్నాయని ప్రచారం చేస్తున్నారు. ఇస్రో ఛైర్మన్ స్వయంగా రాకెట్ నమూనాలను తిరుపతిలో పూజించిన తరువాతే వాటిని అంతరిక్షంలోకి పంపుతున్నారు. అంతటి శాస్త్రవేత్తలు ఎందుకని ఈ విధంగా ప్రవర్తిస్తున్నారు? శాస్త్ర సాంకేతిక విజ్ఞానాలు ఇంతగా అభివృద్ధిచెందినా ఇంకా సమాజంలో మూఢనమ్మకాలు ఎందుకు పెరుగుతున్నాయి? సైన్స్‌కు సమాజానికి సంబంధం ఉంటుందా? ఉంటే ఎలా ఉంటుంది? ఇలాంటి అనేక ప్రశ్నలకు జవాబు వెతుక్కునే క్రమంలోనే నా దగ్గరకు చేరిన పుస్తకం జె.డి.బెర్నాల్ రచించిన "సైన్స్ ఇన్ హిస్టరీ" అనే పుస్తకం.



చిన్నప్పటి నుండి నానమ్మ దగ్గర పెరిగిన నేను సూర్యాపేటలోని సరస్వతి విద్యానిలయంలో 10వ తరగతి వరకు చదువుకున్నాను. ఈ సమయంలో నాదగ్గరకు వచ్చిన పుస్తకాలు రామాయణం, మహాభారతం, భాగవతం కథలతో కూడినవి. పాఠ్యపుస్తకాలే కాకుండా ఇతర పుస్తకాలు చదవాలనే తపనను నాకు నేర్పినవి అవే, ఆ సమయంలో నేను ఆర్.ఎస్.ఎస్. శాఖలకు వెళుతుండే వాడిని. ఒక రోజు మా ఆర్.ఎస్.ఎస్. శాఖ నిర్వహించిన సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన ప్రముఖ్ ఒకాయన భారతదేశం గొప్పతనం గురించి చెప్పసాగాడు. అందులో భాగంగా బ్రిటీష్‌వారి రాకపూర్వం మన గ్రామ స్వావలంబనపై కారల్‌మార్క్స్ పుస్తకాన్ని కోట్ చేశాడు. అది నా జీవితాన్నే మలుపు తిప్పుతుందని అనుకోలేదు. ఆరోజు నుంచి ఎవరీ మార్క్స్? ఆయన రాసిన పుస్తకాలేంటి? ఆయన మన భారత దేశం గురించి ఎందుకు రాశాడు? అసలు ఏం రాస్తాడు? అనే సందేహాలు మొదలైనవి. ఎందుకంటే అప్పటి వరకు ఆర్.ఎస్.ఎస్. ప్రభావంలో ఉన్న నాకు కమ్యూనిస్టులంటే అరాచకులు, హంతకులు, శాంతికి వ్యతిరేకులు అనే భావం ఉండేది. అలాంటి భావనతో ఉన్న నాకు ఈ మార్క్స్ మన దేశం గురించి ఎందుకు రాశాడు? ఏం రాశాడు అనేది తెలుసుకోవాలనే తపన మొదలైంది. సరిగ్గా ఈ సమయంలోనే నాకు 10వ తరగతిలో టైఫాయిడ్ జ్వరం వచ్చి 3నెలలు పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి. కొత్తగూడెంలోని అమ్మానాన్నల దగ్గరకు వెళ్లినప్పుడు అందుబాటులో ఉన్న మార్క్సిజం పుస్తకాలు చిన్నచిన్నవి చదవడం మొదలు పెట్టాను. కొంత అర్ధమైనా చాలా వరకు అర్ధం కాలా. నాలో అప్పటి వరకు ఉన్న భావాలకు విరుద్ధమైన అంశాలు వాటిలో ఉండేవి. వాటిని నా మనసు ఒప్పుకునేది కాదు. జ్వరం తగ్గాక తిరిగి పాఠశాలకు వెళ్లి పరీక్షలు రాసి...సెలవులకు తిరిగి అమ్మానాన్నల దగ్గరకు వెళ్లాను. ఆ సమయంలో ఒక రోజు బి.ఎన్. మా ఇంటికి వచ్చాడు. తిరిగి వెళ్లేటప్పుడు 'నీవూ మాతో రా వెళదాం' అన్నాడు. అప్పుడప్పుడు అలా తీసుకువెళ్లి సాయంత్రం ఇంట్లో వదిలేవాడు. ఆవిధంగానే తీసుకెళుతున్నాడనుకున్నాను. కాని సూర్యాపేటకు తీసుకువచ్చి అక్కడ విద్యార్థి సంఘం నాయకులకు నన్ను అప్పగించి ఇతనిని కూడా క్లాసులకు తీసుకువెళ్ళమని చెప్పాడు. ఈ క్లాసులేంటో నాకు అర్ధం కాలేదు. అక్కడ నుండి బస్సు ఎక్కి పెంచికలదిన్నె గ్రామం చేరుకున్నాం. అక్కడ విద్యార్థిసంఘం జిల్లా క్లాసులు జరుగుతున్నాయి. అక్కడ ఎ.పి.విఠల్, జక్కా వెంకయ్య, మల్లు వెంకటనర్సింహా రెడ్డి, ఉమామహేశ్వరరావు వంటి వారు చెప్పిన గతితార్కిక, చారిత్రక భౌతిక వాదం, రాజకీయ అర్ధశాస్త్రం, పార్టీ కార్యక్రమం, విద్యార్థి ఉద్యమ నిర్మాణం వంటి క్లాసులు అంతకు ముందు నేను విన్న ఆర్.ఎస్.ఎస్. తరగతులకు భిన్నంగా ఉండడమే కాకుండా కమ్యూనిస్టులంటే ఉన్న అపోహలను తొలగించాయి. నేను తెలుసుకోవలసింది ఏదో ఉన్నదనే భావనను నాకు కలుగచేశాయి.

ఇంటర్ చదివే రోజుల్లో తుంగతుర్తి డివిజన్ ఎస్.ఎఫ్.ఐ. తొలి కార్యదర్శిగా పని చేస్తున్న సందర్భంలో నండూరి ప్రసాదరావుగారు రాసిన గతితార్కిక భౌతికవాదం పుస్తకం చదివాను. ఆ తరువాతే ఆ పుస్తకం ప్రతి ఒక్కరూ ఎందుకు చదవాలో అర్ధమైంది. ఆవిధంగా పేరుకు శాంతి,

సహనం అని బయటికి చెప్తూ ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి అరాచకం సృష్టించే సంఘపరివార్ మాయమాటల నుండి బయటపడవేసింది. ప్రజలందరి ఆకలి దారిద్ర్యం తీరాలంటే, ఎప్పుడో చనిపోయిన తరువాత కాకుండా ఈ భూమి మీదే ప్రజల సమస్యలను పరిష్కరించి అందరిని సమానంగా చూసే మానవత్వపు సమాజం ఏర్పడడం కేవలం మార్క్సిజం ద్వారానే సాధ్యమని నాకు చెప్పి నా జీవన గమనాన్నే మార్చిన పుస్తకాలు అనేకం ఉన్నాయి.

1990 నుండి ప్రజా సైన్స్ ఉద్యమ కార్యకర్తగా సైన్స్ ప్రచారం చేసే కార్యక్రమంలో పాల్గొంటున్న నేను 1992 నుండి పూర్తికాలల కార్యకర్తగా పనిచేస్తున్నాను. గత రెండు దశాబ్దాల్లో ప్రజాసైన్స్ ఉద్యమంలో భాగంగా జరిగిన అక్షరాస్యతా ఉద్యమంలో, మద్యపాన వ్యతిరేక ఉద్యమంలో, పిల్లలకు ఆటపాటలతో చదువులందించాలనే జాయ్ ఆఫ్ లెర్నింగ్, బాలోత్సవాలు, సూర్యగ్రహణ ఉత్సవాలు రకరకాల కార్యక్రమాల్లో పాల్గొంటున్నాను. ఒక సైన్స్ కార్యకర్తగా సైన్స్‌ను ప్రచారం చేస్తూ వెళ్తున్న క్రమంలో ఎన్నో ప్రశ్నలు, మరెన్నో సందేహాలు, ఇంకెన్నో అనుమానాలు ఎదురయ్యాయి.

సైన్స్ అణుబాంబులు తయారు చేయడమే మానవ వినాశనానికి కారణం కదా? ఆధునిక సాంకేతిక విజ్ఞానం రూపొందించిన యంత్రాలు అనేక వృత్తులను దెబ్బతీయడం వలన ప్రజలు ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారు కదా? విజ్ఞానశాస్త్రంలో ఎంతో ఉన్నత శిఖరాలను అధిరోహించిన అబ్దుల్‌కలాం వంటి వారే సాయిబాబాలకు వంత పాడుతున్నారు. సూరిభగవంతం వంటి శాస్త్రవేత్తలు సాయిబాబాకు గాలిలో నుండి విభూతి, గొలుసులను తీసే అతీత శక్తులు ఉన్నాయని ప్రచారం చేస్తున్నారు. ఇస్రో ఛైర్మన్ స్వయంగా రాకెట్ నమూనాలను తిరుపతిలో పూజించిన తరువాతే వాటిని అంతరిక్షంలోకి పంపుతున్నారు. అంతటి శాస్త్రవేత్తలు ఎందుకని ఈ విధంగా ప్రవర్తిస్తున్నారు? శాస్త్ర సాంకేతిక విజ్ఞానాలు ఇంతగా అభివృద్ధిచెందినా ఇంకా సమాజంలో మూఢనమ్మకాలు ఎందుకు పెరుగుతున్నాయి? సైన్స్‌కు సమాజానికి సంబంధం ఉంటుందా? ఉంటే ఎలా ఉంటుంది? వంటి అనేక ప్రశ్నలకు జవాబు వెతుక్కునే క్రమంలోనే నా దగ్గరకు చేరిన పుస్తకం జె.డి.బెర్నాల్ రచించిన "సైన్స్ ఇన్ హిస్టరీ" అనే పుస్తకం. ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ సమావేశాలకు వెళ్ళినపుడు 4సంపుటాలుగా ఉన్న ఈ ఇంగ్లీష్ పుస్తకాన్ని తెచ్చుకోవడం జరిగింది. ఆ పుస్తకం ప్రారంభంలోనే జె.డి.బెర్నాల్ రాసిన 4 వాక్యాలు చదవగానే అనేక సందేహాలకు సమాధానాలు లభిస్తాయనే విశ్వాసాన్ని కలుగచేసి మనలను ముందుకు తీసుకువెళుతుంది.

"సైన్స్ లేకుండా నేటి నాగరికత ఆవిర్భావం అసంభవం. శాస్త్రీయ భావాల వ్యాప్తి, మానవ ఆలోచనలకు నూతన రూపాన్ని ఇవ్వడంలో నిర్ణయాత్మకమైన పాత్ర వహించుతుంది. సమకాలీన ప్రపంచంలో మానవ ఆశలు, ఆశయాల మధ్య ఘర్షణలలో శాస్త్రీయ భావాలు ముఖ్యమైన పాత్ర వహిస్తున్నాయి. ఒక ప్రక్క అణుబాంబు, క్రిమి బాంబులు ప్రపంచాన్ని భయాందోళనలకు గురి చేస్తున్నాయి. మరోప్రక్క సైన్స్ సహాయంతో వ్యవసాయ అభివృద్ధి ఆరోగ్య పరిరక్షణ చేసుకుంటూ మరింత సుఖమయమైన జీవితం సాగించాలన్నది మానవుని ఆశ. రెండు ధృవాలుగా విడిపోయిన ప్రపంచం దాని సహజ లక్షణాన్ని వెల్లడిస్తుంది."

కాని దీనిని చదవడం అంత సులువుగా లేదు. ఆరోజుల్లో నాకున్న ఇంగ్లీష్ పరిజ్ఞానం పరిమితులను దృష్టిలో ఉంచుకుంటే దీనిని చదవగలమేమోకాని అర్థం చేసుకోవడం సాధ్యం కాదేమోనని సందేహిస్తూనే చదివాను. నా సందేహమే నిజమైంది. ఇది ఇంక అర్థం కాదా అని మదనపడుతున్న సమయంలోనే పొట్లూరి వెంకటేశ్వరరావు గారు దీనిని తెలుగులోకి అనువదించడం, ఖమ్మంజిల్లా జనవిజ్ఞాన వేదిక శాఖ ప్రచురించడం జరిగింది. తెలుగు అనువాదం కూడా చదివిన తరువాత దానిని అర్థం చేసుకోవడం సుళువైంది. ఒక సాధారణ సైన్స్ గ్రాడ్యుయేట్‌గా ఉన్న నేను ఈ రోజు ప్రజా సైన్స్ ఉద్యమంలో పనిచేస్తూ సైన్స్‌కు సంబంధించిన అనేక చర్చలలో పాల్గొని అభిప్రాయాలను చెప్పగలుగుతున్నానంటే ఈ పుస్తకం కలిగించిన అవగాహన ఫలితమే. సైన్స్-సమాజం-మనిషికి మధ్యగల సంబంధం, "సమాజ మార్పుకు సైన్స్, సైన్స్ అభివృద్ధికి సమాజ మార్పు" ఏవిధంగా దోహదపడినాయో చాలా స్పష్టంగా వివరిస్తుంది. ఒక శాస్త్రవేత్తగా ఉన్న బెర్నాల్ సైన్స్ పరిశోధనలు చేస్తూనే మిగిలిన శాస్త్రవేత్తల్లా కేవలం ప్రయోగశాల గదులకే పరిమితం కాకుండా సైన్స్ ఫలితాలు మానవులందరికీ ఎందుకు అందడం లేదు? సమాజ చరిత్రలో దీనికి ఎక్కడైనా సమాధానం దొరుకుతుందా అని పరిశీలించాడు. భౌతిక శాస్త్రాలకు-సామాజిక శాస్త్రాలకు గల సంబంధం ఏమిటి? అనే సందేహాలను వెతుక్కునే క్రమంలో అతనికి సరైన సమాధానం మార్క్సిజంలో దొరికింది.

ఇంకా స్పష్టంగా చెప్పాలంటే తెలుగు అనువాదానికి ముందుమాట రాసిన ప్రఖ్యాత శాస్త్రవేత్త యునెస్కో-కళింగ అవార్డు గ్రహీత డి.బాలసుబ్రహ్మణ్యన్ చెప్పినట్లు "ఆయన(జె.డి.బెర్నాల్) సున్నిత మనస్కుడు. అందుచేతనే ఆయనవి వామపక్ష భావాలు. పేదల కష్టాల పట్ల సానుభూతిగలవాడు. అందుకే పేదలకు గౌరవప్రదమైన జీవితం కోసం, సమసమాజ నిర్మాణానికి అనువైన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. అతడు హేతువాది. కనుకనే సమాజ నిర్మాణానికి సైన్స్ దారివేస్తుందని విశ్వసించాడు."

భారతదేశంలో ప్రజా సైన్స్ ఉద్యమానికి పితామహుడుగా చెప్పుకోదగిన ఎం.పి.పరమేశ్వరన్ ఈ పుస్తకం గురించి చెప్పిన అంశాలను పరిశీలిస్తే దాని గొప్పతనం గురించి అర్థమవుతుంది."వ్యక్తులూ, కార్పోరేట్ సంస్థలూ లాభాల స్వార్థంతో, శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని హరిస్తున్నారు. పేటెంట్ చట్టాల సవరణ, మేధోపర ఆస్తిహక్కుల గుర్తింపు కోసం నిర్బంధాలు ఈ ధోరణి నుండి వచ్చినవే. పేదల మూలుగులు పీల్చే ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి. ఈ పోరాటంలో శాస్త్ర పరిజ్ఞానం వారికి ఆయుధం కావాలి.21వ శతాబ్దంలో పీడితుల పోరాటాలకు ఇది అత్యంత ప్రధానమైంది. భారత దేశంలోని ప్రతి పౌరుడు, దేశ ఆర్థిక రాజకీయ కార్యకలాపాలలో భాగస్వామి కావాలి. లేకుంటే ప్రజాస్వామ్యం ప్రమాదానికి గురౌతుంది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించి ప్రజలను స్వాధి-కారులను చేసే ప్రయత్నంలో ఈ గ్రంథం క్రియాశీలక సైన్స్ కార్యకర్తలకు గైడ్."

4 సంపుటాలుగా వచ్చిన ఈ పుస్తకంలో 8 అధ్యాయాలున్నాయి. 1.సైన్స్ ఆవిర్భావం-సైన్స్ స్వభావం, 2.పురాతన ప్రపంచంలో సైన్స్, 3.నమ్మకాల కాలంలో సైన్స్, 4.ఆధునిక సైన్స్ పుట్టుక, 5.పరిశ్రమలు-సైన్స్, 6.మనకాలంలో సైన్స్, 7.గత వర్తమాన సామాజిక విజ్ఞాన శాస్త్రాలు, 8.ముగింపు. ఆదిమ కాలంలో సైన్స్ ఎలా ఆవిర్భవించిందనే అంశం నుండి మొదలుపెట్టి సమాజ మార్పుతో సైన్స్ కూడా ఏవిధంగా మార్పు చెందిందో వివరించాడు.

స్ఫూర్తిని కలిగించిన పుస్తకాలు అనేకం ఉన్నాయి. వాటన్నిటిని పేర్కొనడం సాధ్యం కాకపోయినా రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాల గురించే కాకుండా సైన్స్&టెక్నాలజీ, విద్యా, ఆరోగ్య రంగాల గురించిన అవగాహన కలిగించిన పుస్తకాలూ ఉన్నాయి. పుస్తకాలే కాకుండా అధ్యయనానికి తోడ్పడిన ఒక అంశాన్ని చివరగా తప్పనిసరిగా పేర్కొనాలి. ఆరోగ్య రంగానికి సంబంధించిన అనేక అంశాలను మెయిల్‌లో పంపి చదివావా లేదా ఇవి చదివి నీవు చర్చలలో పాల్గొనాలి అని నిరంతం పర్యవేక్షించి చదివించిన వ్యక్తి ఈరోజు మన మధ్యలేకున్నా నిరంతరం గుర్తొచ్చే డా॥జెట్టి శేషారెడ్డిగారి గురించి, చివరిదాకా నన్ను గైడ్ చేసిన వి.ఎన్ గురించి ప్రస్తావించకుండా అధ్యయనం గురించిన ఈ వ్యాసం పూర్తి చేయలేను.

★

ఎగిలి వారింది

ఎగిలివారింది మొదలు
అతని చేతులు
చేలకల్లో పక్షుల్లా వాలి
నాట్లు వేస్తు కలుపులు తీస్తు
నీళ్ళకోసం గూడు వేస్తుంటాయి
మోకాళ్ల లోతు దిగబడ్డ కాళ్లు
బురద పాములవుతాయి
వీపుమీద అట్ట కట్టిన
ఒండ్రు మట్టి - జవసత్వాలకు
పూసుకున్న మర్దనం అవుతుంది!
రోజు తన పని తాను
చేసుకొంటు పోతుంటాడు
అతని వల్ల...
ఎవరికి ఏ నష్టములేదు
పట్టించుకొన్నవారు
అసలు ఉండరు...
పండించిన పత్తులు
వర్షాల్ని తుఫానుల్ని ఎదిరించి
పండించిన ధాన్యాన్ని



బుక్కెడు బువ్వ కోసం
ధర పలికినా పలకకున్నా

చీలికలు పేలికల్లా చిరిగిన
బ్రతుకు బండి నెట్టడం కోసం!
మార్కెట్‌కు తరలిస్తున్నపుడు
అతని చుట్టు ఈగల్ల
పట్టిపీడించే జెలగల్లా
చీకటి మనుష్యులు....
వ్యాఘ్రాల్లా చుట్టు ముడతారు!
ధాన్యం బోరాల్లో నింపుకొని
వగలాడి జవ్వనిలా జడరువ్వుతు
తీసుకు వెళుతున్నప్పుడు
దప్ప చప్పడు మిన్ను ముడుతుంది
పత్తికూడ అతని ప్రాణం తీసే
అప్ప కత్తి అవుతుంది
బతుకు ఎగిలి - వాడింది
మెతుకు ఏడకో ఎగిరిపోయింది!!

- రావుల పుల్లాచారి

కవిత్వమ్

అమ్మే ఓ అర్ణవమై

- కోటం చంద్రశేఖర్

మొక్కలా?
వాడిన పిక్కలతో ఎండిన డొక్కలతో
మొక్కలా?
ఆ
మొక్కలా పూసేది
సుగంధాలు వీచేది-
అమ్మ ఊరెళ్లింది
అయ్యో
మొక్కలు ఉపవాసం
మొక్కలు వనవాసం

ఎవర్ననాలి?
పిల్లలకు బడి
నాకు అప్ అండ్ డౌన్స్ హడావుడి
ఆమెకు సీరియల్స్ సందడి

మొక్కలు మరణశాసనం
మొక్కలు శవాసనం
అమ్మే ఓ అర్ణవమై
అమ్మే ఓ అంబరమై
చిక్కని మా గుండెలలో
మొక్కల ఆ కుండీలలో
మమకారం సహకారం
సమానంగా కురియాలని
సమూహంగా మురియాలని

★

కవిత్వమ్

ఏల వచ్చును వాడు

ఏల వచ్చునువాడు ఏమేమిగొనిపోను
ఆర్థికంగ చితికి అలసిపోయినవాడు
ఒక్కటిగయున్న ఈ చక్కని దేశమును
రెండు ముక్కలు చేయ రండంటు పిలిచితిరా 'ఏ'

స్వాతంత్ర్య భారతిని స్వర్గధామముచేయ
ఆంగ్లేయులపాలనను అంతమొందించగా
స్వాతంత్ర్య సమరమును సాగించిరెందరో
మాతృదేశపు దాస్య శృంఖలాలను దెంచ 'ఏ'

కరకు యుద్ధాలతో కసితీర్చుకొనువాడు
పసికందునని కూడ జాలి చూపడు చూడు
పచ్చిరక్తముత్రాగె పచ్చినాకొడుకాడు
ఖండఖండాలను చీల్చే ఛండశాసనుడూ 'ఏ'

రిక్త హస్తాలతో రక్తాన్ని చిమ్మెటి
నరరూప రాక్షసుడు నాజీలవారసుడు

దేశదేశాలను విభజించి పాలించ
విశ్వమంతయు నేడు విషతుల్యముగ చేసే 'ఏ'

సామ్రాజ్యవాది విషపు వ్యూహమంటు
అణుయుద్ధమున్నదా! అంతర్ యుద్ధమా!
ఒక్క ప్రపంచమును ముక్కలు ముక్కలు చేసి
సంకీర్ణ సేనల బూటు మాటున యుండి
సర్వ సంపదలను కొల్లగొట్టెడివాడు 'ఏ'

పసిడి కాంతులనీలు ప్రతిమ నా భారతి
కొల్లగొట్టగ నేడు కుయుక్తులను పన్ని
అందించిరా హస్తమ్ము! అందుకొమ్మని నీకు
తెరచాటుగా నిన్ను చాలించుమని బల్క 'ఏ'

- జవెల్లి



కొబ్బరి అన్నం

కావలసిన వస్తువులు

బియ్యం - 4 కప్పులు, పచ్చి కొబ్బరి కోరు - 4 కప్పులు, నెయ్యి - 6 టేబుల్‌స్పూన్లు, ఎండుమిరపకాయలు - 10 పచ్చిమిరపకాయలు - 4, కరివేపాకు - 2 రెబ్బలు జీడిపప్పు - 20 బద్దలు, నూనె - తగినంత ఉప్పు - తగినంత, ఆవాలు - 2 టీ స్పూన్లు మినపప్పు - 3 టీ స్పూన్లు, శనగపప్పు - 3 టీ స్పూన్లు, సన్నగా తరిగిన కొత్తిమీర - 2 టేబుల్ స్పూన్లు



తయారు చేసే విధానం

ముందుగా పచ్చిమిరపకాయల్ని సన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి. తరువాత బియ్యం శుభ్రంగా కడిగి, అరగంటపాటు నీళ్ళలో నానబెట్టాలి. తరువాత అన్నం వండి, దానిని వెడల్పుగా వున్న పళ్లెంలో కుమ్మరించి, పలుచగా సర్ది ఆరబెట్టాలి. అందులో మెత్తని ఉప్పు, నాలుగు స్పూన్ల నెయ్యి కలపాలి. ఒక బాణలిలో రెండు స్పూన్ల నెయ్యి వేసి స్టౌమీద వేడి చేయాలి. ఇందులో జీడిపప్పును వేసి దోరగా వేయించి తీసుకోవాలి. ఇందులో నూనె పోసి, కాగాక ఆవాలు, మినపప్పు, శనగపప్పు, ఎండుమిరపకాయ ముక్కలు వేసి పోపు పెట్టుకోవాలి. తరువాత ఇందులో పచ్చిమిరపకాయల ముక్కలు, పచ్చి కొబ్బరికోరును వేసి రెండు నిమిషాలు వేయించాలి. ఇందులో ఆరబెట్టిన అన్నం వేసి బాగా కలియబెట్టాలి. తరువాత సెగ తగ్గించి, సన్నగా తరిగిన కొత్తిమీర, కరివేపాకు వేసి కలియబెట్టాలి. చివరిగా నేతిలో వేయించిన జీడిపప్పు కలపాలి.

రెండు నిమిషాలాగి బాణలిని స్టౌమీద నుంచి దించుకోవాలి. కొబ్బరి అన్నం సిద్ధం. దీనిని వేడివేడిగా ఎదైనా గ్రేవీతో లాగించొచ్చు. సాంబారుతో కూడా ఊదేయొచ్చు.

క్యారెట్ రైస్

కావలసిన వస్తువులు

మిగిలిపోయిన అన్నం - 500 గ్రాములు, క్యారెట్ దుంపలు - 8 ఉల్లిపాయలు - 8, కరివేపాకు - 2 రెబ్బలు, పచ్చిమిరపకాయలు - 10, పలావు మసాలాపొడి - 1 స్పూను, ఆవాలు - 1 టీస్పూను, జీలకర్ర - 1 టీ స్పూను, కొత్తిమీర - 1 కట్ట, నూనె - తగినంత, ఉప్పు - తగినంత

తయారు చేసే విధానం

ముందుగా క్యారెట్ దుంపలపలను శుభ్రంగా కడిగి తొక్కను చాకుతో తొలగించాలి. తరువాత వీటిని సన్నగా తురమాలి. ఉల్లిపాయల్ని బాగా సన్నని ముక్కలుగా కోసుకోవాలి / తురుముకోవాలి. పచ్చిమిరపకాయల్ని చిన్న ముక్కలుగా కోసుకోవాలి. కొత్తిమీరను శుభ్రంగా కడిగి తరిగి పెట్టుకోవాలి. తరువాత ఒక బాణలిలో నూనె పోసి స్టౌ మీద వేడి చేయాలి. ఇందులో ముందుగా ఆవాలు, జీలకర్ర, కరివేపాకు వేసి తాలింపు పెట్టుకోవాలి. ఇందులో పలావు మసాలా పొడి, క్యారెట్ తురుము, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిరపకాయ ముక్కలను వేసి దోరగా వేయించాలి. తరువాత ఇందులో తగినంత ఉప్పు కలిపి బాణలిని స్టౌమీద నుంచి కిందకు దించుకోవాలి. అప్పుడు బాణలిలోని మిశ్రమంలో మిగిలిపోయిన అన్నం కలిపి, పైన సన్నగా తరిగిన కొత్తిమీరను చల్లుకోవాలి.

అంతే... క్యారెట్ రైస్ రెడీ. టమోటా చట్నీ కలుపుకుని తింటే సూపర్.



బంగాళదుంపల అన్నం

కావలసిన వస్తువులు

బియ్యం - 2 కప్పులు, బంగాళదుంపలు - అరకిలో, ఉల్లిపాయలు - 4, పచ్చిమిరపకాయలు -15, టమోటాలు -8, పోపుసామాను - 2 టేబుల్‌స్పూన్లు, నెయ్యి-2 టేబుల్ స్పూన్లు, సన్నగా తరిగిన కొత్తిమీర-2 టేబుల్ స్పూన్లు, పసుపు-1/2 టీస్పూను ధనియాలు-1/2 టీస్పూను, జీలకర్రపొడి-1/2 స్పూను గరం మసాలాపొడి-1 టీస్పూను, జీడిపప్పు-20 బద్దలు, కొత్తిమీర - 1 కట్ట నూనె - తగినంత, ఉప్పు- తగినంత

నూరుకోవలసినవి

అల్లం -2 ముక్కలు, వెల్లుల్లి - 10 రేకులు దాల్చినచెక్క - 2 ముక్కలు, లవంగాలు - 10

తయారు చేసే విధానం

ముందుగా టమోటాలు, ఉల్లిపాయలు, పచ్చిమిరపకాయలను నీళ్ల కలపకుండా మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. బంగాళదుంపల పొట్టు తొలగించి, అంగుళం ముక్కలుగా తరగాలి. అల్లం, వెల్లుల్లి దాల్చినచెక్క లవంగాలను నూరి మసాలా సిద్ధం చేసుకోవాలి. బియ్యం శుభ్రంగా కడిగి అన్నం వండాలి. అన్నాన్ని వెడల్పాటి పళ్లెంలో వేసి పలుచగా సర్దాలి. బంగాళదుంపల ముక్కల్ని నూనెలో చిప్స్ మాదిరిగా వేయించి తీసుకోవాలి. జీడిపప్పును ముక్కలుగా చేసి నేతిలో వేయించి తీసుకోవాలి. తరువాత ఒక బాణలిలో నూనె పోసి స్టౌమీద వేడి చేయాలి. ఇందులో ముందుగా ఆవాలు, మిగిల్చిన అల్లం, వెల్లుల్లి, దాల్చినచెక్క, లవంగాలతో కూడిన మసాలా ముద్దను వేడి తడి ఆరిపోయేంతవరకు మీడియం సెగలో వేయించాలి. అందులో జీలకర్రపొడి, ధనియాలు, గరంమసాలా పొడి, పసుపు వేసి బాగా కలపాలి. ఇందులో గ్రైండ్ చేసి సిద్ధంగా వుంచుకున్న టమోటాలు, ఉల్లిపాయలు, పచ్చిమిరపకాయల మిశ్రమాన్ని తగినంత ఉప్పు వేసి మగ్గించాలి. తరువాత చల్లారబెట్టిన అన్నం వేయాలి. ఇందులో సన్నగా తరిగిన కొత్తిమీరను కలిపి గరిటెతో బాగా కలియబెట్టాలి. వేయించి సిద్ధంగా వుంచుకున్న బంగాళదుంప ముక్కలు, జీడిపప్పు ముక్కలను కలిపి, అన్నం మిశ్రమం వేడెక్కిన తరువాత బాణలిని స్టౌమీద నుంచి దించుకోవాలి. బంగాళాదుంపల అన్నం రెడీ. వేడివేడిగా అతిథులకు వడ్డించాలంతే.

సీరియల్

జరిగినకథ:

కుయేన్‌కు చిన్నారి డాన్ పరిచయం సంతోషం కలిగిస్తుంది. అయితే అమెరికన్ ముష్కరుల వల్లే డాన్ తల్లి మరణించిందని, పసివాడికి బొమ్మలు అవి ట్రాయ్ కొనిచ్చేవాడని తెలుసుకొంటుంది కుయేన్. అప్పటి నుంచి వాడిని ప్రేమగా చూసుకొంటుంది. ఓరోజు వున్నట్టుండి కుయేన్, డాన్, డాన్ అవ్వను వేరే జైలుకు మారుస్తారు. తర్వాత అక్కడినుంచి విడుదల చేస్తారు. డాన్‌కు బొమ్మలు, చిరుతిళ్లు కొనిపెట్టడానికి, తమ పెళ్లికైన అప్పు తీర్చడానికి రాత్రింబగళ్లు కష్టపడుతుంది కుయేన్. ఓసారి 'ఛోక్వాన్' ఆసుపత్రిలో వున్న ట్రాయ్‌ని చూడ్డానికి వెళుతుంది. అక్కడ కుయేన్‌ను చూచి ట్రాయ్ ప్రేమగా పలకరిస్తాడు. ఆ తర్వాత....

వియత్నాం వీరుడు ఎన్‌గుయెన్ వాన్‌ట్రాయ్

కథనం: ఫాన్-థి-కుయేన్

అనువాదం: పాటూరి రామయ్య

(తొమ్మిదో భాగం)

వెంటనే మెయిన్‌గేటు దగ్గరకు పరుగెత్తాను. ఆ రంధ్రం గుండా లోపలికి చూశాను. ఇంకా ఆయన ఇనపకమ్ములను ఆనుకునే ఉన్నాడు. ముఖం వాడిపోయి కలత చెంది ఉంది. పేరుబెట్టి పిలిచాను. ఆ రంధ్రంలో నా చేయి లోపలికిపెట్టి ఆయనకేసి ఊపాను. లోపల నుంచి గార్డు నన్ను తిడుతూ అరిచాడు. ఒకరాయి విసిరాడు. అదృష్టవశాత్తు అది నాకు తగలలేదు. ఖణీమని గేటు తలుపుకి తగిలింది. ట్రాయ్ హృదయం ద్రవించిపోయింది. ఇలా అరిచాడు.

'ప్రియమైన కుయేన్! రెండు వారాలకొకసారి మాత్రమే రావాలి. వారంలో పలుమార్లు వచ్చి ఇలా బాధలు పడవద్దు. ఇట్లా ప్రతిసారీ సాధ్యంకాదు. విన్నావా కుయేన్?'

వెక్కి వెక్కి ఏడుస్తూ ఇలా జవాబిచ్చాను.

'ఈ విధంగా ఒకటికి పదిమార్లు బాధలు పడ్డప్పటికీ నిన్ను చూడ్డానికి వస్తూనే ఉంటాను. నన్ను గురించి ఏమీ దిగులు పడవద్దు.'

ఆయనకు చాలినంత ఆహారం సంపాదించి పెట్టగలననే నమ్మకం నాకుంది. ఛోక్వాన్ ఆసుపత్రిలో వున్న రోగుల (ఖైదీలు) పరిస్థితి క్రమక్రమంగా చావుకు సిద్ధం చేసే శిక్షవలె ఉందని నేను భావించాను. ఖైదీలను అంటురోగులతో కలిపి బంధించారు. క్షయ, కుష్టురోగులను కూడా వాళ్ళతో కలిపారు. ఆయన జైలు నుంచి తప్పించుకు వచ్చేందుకు చేసే మూడవ ప్రయత్నం విజయవంతం అయ్యేందుకైనా తన ఆరోగ్యం శీఘ్రంగా బాగుండాలని కోరుకునేదాన్ని.

మా తల్లి కూడా ఆయన్ను చూడాలని కోరింది. కాని, ఆమెను పలుమార్లు ఆ ప్రయత్నం నుండి ఆపగలిగాను. ఎందుకంటే అల్లుడికి ఒక్కమాటైనా చెప్పగలిగే స్థితిలోలేదు. పైగా అక్కడకు వచ్చి చూడటం అంటే అసాధ్యమైన విషయం. ఇప్పుడు మాత్రం ఆమె నేను చెప్పేది ఏమాత్రం పట్టించుకోలేదు. ఈసారి తప్పకుండా నా చెల్లెలు క్యాన్‌ను, ఆమెను నాతో తీసుకెళ్ళేందుకు బలవంత పెట్టింది. మా అమ్మ ఇలా అన్నది :

"ఒక నిమిషంగాని, క్షణంగాని అతణ్ణి చూస్తేనే గాని నా మనసు కుదుటపడదు. ఎన్ని దఫాలుగా నేనలాంటి అవకాశాలు పోగొట్టుకోలేదు!"

ట్రాయ్‌ని మా అమ్మ చాలా గౌరవించేది. ఆమెకు పదకొండు మంది సంతానం. అయినప్పటికి అల్లుణ్ణి చాలా గొప్పగా ప్రేమించేది. మేము నివసిస్తున్న కార్మికపేట అగ్నిప్రమాదానికి గురైనప్పుడు పనికి ఎగనామం పెట్టి కార్మికులతో కలిసి మంటలార్పేందుకు సాయపడ్డాడు. ఇల్లు తగులబడుతున్నా లెక్కచేయకుండా మా యింట్లోకి జొరబడి ముఖ్యమైన వస్తువులన్నీ బైటకు చేరవేశాడు. స్థానిక ప్రజల గౌరవాభిమానాలు అమితంగా చూరగొన్నాడు. మా అమ్మ ఆయనమీద చూపే ప్రేమాభిమానాలకు అంతంటూ ఉండేదికాదు.

అందువల్ల ఆమెకు ట్రాయ్‌ని చూపించాలని తీసుకెళ్ళాను. నా అదృష్టం పండింది. ఒకటి, రెండు నిముషాలు గేటు తెరిచే ఉంది. ఆయన్ను చూడగానే మా అమ్మ పెద్దగా ఏడుస్తూ ఇలా అన్నది :

'ప్రియమైన టూ! చూడ్డానికి వచ్చాను నాయనా. బాగున్నావా?' (టూ – తలిదండ్రులు బిడ్డను గౌరవంగా పిలవడం)

క్యాన్‌గూడా ఆతృతతో ఇలా పిలిచింది.

'టూ సోదరా! టూ సోదరా!

ట్రాయ్ చిరునవ్వు నవ్వాడు. ఏమేమో చెప్పాడు, గాని ఆ గడిబిడిలో వినపడలేదు. ఆవరణ లోపలా బైటా అరుపులూ ఏడ్పులూ, మా అమ్మ ముఖం కన్నీళ్ళతో తడిచిపోయింది. గేటు దగ్గరే కూలబడింది. ఒక డజను మంది తల్లులు తమకు జరిగిన అన్యాయాలను, దురదృష్టాలను వెల్లడిస్తున్నారు. ఒక పోలీసువాడు కార్లోంచి దిగి వాళ్ళ దగ్గరకు వెళ్ళాడు. ఒకామెతో ఇలా అన్నాడు.

'నేనున్న ప్రతిచోట నువ్వు హాజరు! మళ్ళీ ఇక్కడ! నీ కూతురు జబ్బుతో లోపల ఉందా?'

ఆమె మాట్లాడకుండా అతని వద్దకు వెళ్ళింది. నేనామెను గుర్తుపట్టాను. ఆమె శ్రీమతి యం. ఈ మధ్యనే ఆమెను గురించి తెలుసుకున్నాను.

గత బుధవారంనాడు పెద్దవర్షం కురిసింది. మెయిన్‌గేటు తలుపుకున్న రంధ్రంలోంచి ఆయన్ను లోపలికి చూస్తూ ఉండిపోయాను. వర్షం పడటంవల్ల స్పష్టంగా ఆయన్ను

చూడలేకపోయాను. పెద్దగా పిలవడానికి ప్రయత్నించాను. జడివాన మోతకు నా గొంతు ఆయనకు వినపడలేదు. నిరాశతో గేటును ఆనుకొని ఏడుస్తూ పడిపోయాను. శరీరమంతా తడిసిపోయింది. నా వొంటిమీద వానకోటు కప్పి దగ్గరలోనే వున్న ఒక యింటి చూరుకింద పడేశారెవరో! ఎవరో కాదు అలా చేసింది శ్రీమతి యం. నేను ట్రాయ్ భార్యనని తెలుసుకుంది. గాఢంగా నన్ను కౌగిలించుకొని ఇలా అన్నది :

'నేను చాలా త్వరగా తెలుసుకొన్నాను. ఎన్నో పర్యాయాలు నువ్విక్కడ తిరుగుతూ ఉంటే చూశాను.

పోలీసు వాడిలా అన్నాడు :

'ఇది వరకు నేను చెప్పాను. ఒక్కసారైనా జండాకు వందనం చేసేట్టు, కమ్యూనిస్టులు హింసాకారులని అంగీకరించేట్టు నీ కూతుర్ని ఒప్పించమని చెప్పాను. అప్పుడుగాని నీ కూతురు విడుదల కాదు. ఎందుకొచ్చిన కర్మ? నాలుగైదేళ్ళ నుంచి ఇలా కాలికి బలపం కట్టుకొని తిరగడం, పడిగాపులు పడి కాచుక్కూర్చోవడం? ఒక జైలు నుంచి మరో జైలుకు మార్చినప్పుడల్లా ఆమెను చూడ్డానికి నువ్వు అవస్థలు పడ్డం దేనికి?'

శ్రీమతి యం. ఇలా జవాబిచ్చింది.

'దాన్ని కన్నందుకు కాపాడ్డం కూడా నా బాధ్యత. జండాకు వందనం చేయడంగాని, కమ్యూనిస్టులు మంచివాళ్లనిగాని, చెడ్డవాళ్ళనిగాని చెప్పడం అంతా దాని ఇష్టాయిష్టాల మీద ఆధారపడి ఉంది. నా కూతురని దానిమీద ఒత్తిడి చేయలను.'

పదవసారి ట్రాయ్‌ని చూడ్డానికి ఛోల్వాన్ ఆసుపత్రి కెళ్ళాను. ఆయనక్కడలేదు. గేటు కాపలా వాడిలా అన్నాడు లెక్కలేని తనంగా :

'నీ మొగుడు తేరుకున్నాడు. బాగా నయమైపోయింది. అందువల్ల మళ్ళీ జైలుకు పంపించారు.'

ట్రాయ్‌ని మళ్ళీ జనరల్ పోలీసు డిపార్టుమెంటు కొట్లల్లో బిగించి ఉంటారని ఊహించాను. తర్వాత 'ఎక్స్' సోదరి జైల్లోంచి చాకచక్యంగా తప్పించుకొని వచ్చింది. ట్రాయ్‌ని గురించి ఆమె ఈ కింది గాథ చెప్పింది.

'అది ఆగస్టు 4వ తేదీ ఉదయం. జైలు ఆవరణలో ఖైదీలు గుంపులుగా చేరి పనిచేస్తున్నారు. స్త్రీల ఖైదీల కొట్ల కెదురుగా ఆసుపత్రి వ్యాన్ వచ్చి ఆగింది. వ్యాన్ తలుపు అతికష్టంగా తెరుచుకుంది. దానిలోంచి ఎవరో పెద్దగా ఇలా అంటున్నారు. నేనే స్వయంగా నడవగలను' ఇద్దరు పోలీసు ముష్కరుల మధ్య ఆ ఖైదీని చూశాం. అతడు నడవలేకపోతున్నాడు. వ్యాన్‌లోనే క్రిందిపడివున్నాడు. తెల్లటి బ్యాండేజ్‌తో కట్టబడిన కాలు లాక్కొంటూ పాకులాడుతున్నాడు. పొట్టిగా, ఊదా రంగులోవున్న దుస్తులు ధరించి వున్నాడు. అతడు అతికష్టం మీద అలా పైకి లేచాడు. అప్పుడు నేను గుర్తుపట్టాను. వెంటనే బిగ్గరగా ఇలా అన్నారు అక్కడ చేరినవాళ్ళంతా.

'అదిగో! మళ్ళీ ట్రాయ్ వస్తున్నాడు'

స్త్రీ ఖైదీలందరూ వరండాలో తొక్కిసలాడిపోతున్నారు. ఆ వరండాలోకి ఎవరూ రాకూడదని నిషేధించారు. ప్రతి ఒక్కరి హృదయంలోను ఉత్సాహం, సంతోషం పొంగి పోతున్నది. అందరూ ఇలా అన్నారు :

'కుయేన్ భర్త ఇక్కడున్నాడు. ట్రాయ్ మళ్ళీ వస్తున్నాడు.'

ఈ వార్త అప్పటికప్పుడే అన్ని కొట్లలోకి వ్యాపించింది. కొట్లలో ఖైదీలు ఆనందం పట్టలేక పోయారు.

'ట్రాయ్ సోదరుడు మళ్ళీ వచ్చాడు.' అన్న మాటలు ప్రతిధ్వనించాయి.

పురుష ఖైదీలు పరుగెత్తుకుంటూ వచ్చారు. వాళ్ళ దేహంలోంచి చమట కారిపోతుంది. కాళ్ళూ, చేతులూ మట్టితో నిండిపోయాయి. వాళ్ళు వ్యాన్ చుట్టూ మూగారు.

'ఎక్కడ-ట్రాయ్ ఎక్కడున్నాడు?' ఆతృతగా అడిగారు. వెంటనే ఒక డజనుమందికి పైగా వ్యాన్ మీద పడ్డారు.

ఒక ఖైదీ నడుం కావటేసి పట్టుకొని వెలుపలికి దిగాడు ట్రాయ్, అతని మిత్రుని మీద ముఖం మోపాడు. మిగతావాళ్ళు శరీరం, కాళ్ళు పట్టుకొన్నారు. ఇదంతా ఒక చిటుకలో జరిగిపోయింది. పోలీసు ముష్కరులకు ఇది చాలా ఆశ్చర్యం కలిగించింది.

దండిస్తున్నట్లు కోపంగా ఇలా అరిచారు పోలీసు ముష్కరులు.

'అవతలికి వెళ్ళండి. ఈ దుర్మార్గుడి దగ్గరకు రావడానికి మీకెవరు అనుమతి ఇచ్చారు? మిత్రుల చేతుల్లోంచి ట్రాయ్‌ని లాక్కున్నారు పోలీసులు.

కొట్ల లోపలవున్న స్త్రీ ఖైదీలు కిటికీ ఇనుపకమ్ముల నానుకొని ఇలా అరిచాం. "ఓ దుర్మార్గుల్లారా? బాగులేని మనిషిని అలా చేయడానికి మీకెంత ధైర్యం? ఇది చాలా అమానుషం. నిజంగా ఇది దుర్మార్గపు చర్య."

పురుష ఖైదీలందరూ ట్రాయ్ చుట్టూ చేరారు. ట్రాయ్‌ని "సి" భవనంలోకి చేర్చారు. ఆ భవనంలోనే కొత్తవాళ్ళను గురించి వివరాలు నమోదు చేసుకుంటారు. పడకమీద అతను పడుకొన్న తరువాత కష్టపెట్టడం మానేశారు.

మరుసటి రోజు ఆగస్టు 5వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు విచారణ కోసమని ట్రాయ్‌ని బైటకు తీసుకొచ్చారు. మిత్రుని వీపు మీద ఆనుకొని బాధగా నడిచాడు. వ్యాన్ వచ్చేవరకు అక్కడే నిలిచిపోయాడు."

కొంచెం ఆగిన తర్వాత 'ఎక్స్' సోదరి ట్రాయ్‌తో గడిపిన ప్రశాంతమైన, విలువైన పదినిమిషాలు గూర్చి కథగా నాతో ఇలా చెప్పింది :

'నేనతనికి మూడు గజాలకింకా దగ్గరలోనే ఉన్నాను. నీకు లే అవుట్ జ్ఞాపకం ఉందా? జ్ఞాపకం లేదూ! ఒక చిన్న మేజా, కుర్చీ, స్త్రీల కొట్లకు ఎదురుగా ఉన్నాయి. అవి వార్డర్ ఇన్‌ఛార్జి కోసం, వచ్చేపోయే వ్యాన్లకు బాధ్యుడు ఆ వార్డరు ఇన్‌ఛార్జి. మేజాకు పక్కనే ఉన్న కుర్చీలో కూర్చున్నాడు ట్రాయ్.

'ఊదారంగు చొక్కా, నీలిరంగు లాగు ధరించి వున్నాడు. తలవెంట్రుకలు బాగా దువ్వున్నాయి. నువ్వీ ఆసుపత్రిలో చూసిన దానికంటే సన్నగా లేడు. ఆరోగ్యంగానే వున్నాడు. అతడు చిరునవ్వు నవ్వడం లేదు. అయితే మమ్మల్ని చాలా సంతోషంతో చూస్తున్నాడు. పోలీసు ముష్కరులు అతనికి దగ్గరలో మమ్మల్ని వుండనీయకుండా దూరంగా నెట్టివేయడానికి ప్రయత్నించారు. నిరాకరించి ముందుకు వెళ్ళేవాళ్ళను చితగ్గొట్టి వెనక్కు నెట్టేశారు. కాని మాలో ఒక డజను మందికి పైగా తొలగిపోరాదని తిష్టవేసి మరీ అక్కడే కూర్చొన్నాం.

'స్త్రీల కొట్ల వైపుగా ముఖం మళ్ళించి కూర్చొన్నాడు ట్రాయ్. ఆయన చూపుల్లో మార్దవం వ్యక్తమౌతోంది.

'చిరునవ్వు నవ్వాలనీ, మాతో ఏదో విషయం చెప్పాలని ఎంతో ఆశతో వున్నట్లు కనపడ్డాడు. నువ్వు చెప్పిన విషయాలు ఆయనతో చెప్పమని మా మధ్య గుసగుసలు బయల్దేరాయి. కాని మేమాపని చేయలేకపోయాం.

నలుగురు ముష్కరులు అతన్ని చుట్టుముట్టారు. ఒక నిముషం కూడా కదలనీయకుండా పట్టుకున్నారు. వాళ్ళు నీకు జ్ఞాపకం వుండే వుంటారు. గాయాప్, లూక్, టాంప్యూ, బొమికల మొహంవాడు లూక్ లేడూ ఆ దుర్మార్గుడు పరిహసిస్తూ ఇలా అన్నాడు :

'నువ్వా యువకుడవు? నీ భార్య కూడా నాకు తెలుసు. ఆమె కుర్రది. చాలా అందగత్తె. పైగా మీరు నూతన దంపతులు. హాయిగా సుఖసంతోషాలతో జీవించడానికి మీరెందుకిష్టపడటం లేదు? వియత్నాంగ్ తప్పుడు మాటలువిని ఈ దుర్మార్గానికెందుకు ఒడిగట్టావ్?'

'ట్రాయ్ మా వైపు చూస్తూ కళ్ళు నలువైపులా తిప్పాడు. మూతి ఒక పక్కకు వంకపెట్టి చిన్నగా నవ్వుతూ ఇలా జవాబిచ్చాడు.

'అది దుర్మార్గమా? నా భవిష్యత్తును నిర్ణయించగలిగే పవిత్ర ఆశయం గనుకనే అలా చేశాను. అమెరికన్ దురాక్రమణదారులను హతమార్చడం ఒక దుర్మార్గమా?'

'నువ్వు చేసింది మంచిపనేనని ఎలా చెప్పగలవు? ఇప్పుడు నీకు ఒక కాలు లేదు. కుంటివాడవయ్యావు. వియత్నాంగ్ దుర్బోధలు విన్న ఫలితమే కదా ఇది.

ఆ దుర్మార్గుని ముఖంలోకి తీవ్రంగా చూస్తూ గొంతు పెద్దగా విప్పి ఇలా జవాబిచ్చాడు ట్రాయ్.

(మిగతాభాగం వచ్చేవారం)

చిన్నకథ

తారతమ్యాలు

దగ్గు భయంతో రామదాసు ఆ రాత్రి భోజనం చెయ్యలేదు. అయినా రాత్రి పదిగంటలు కావస్తున్నప్పుడు దగ్గుతెర ముంచుకు వచ్చింది. పడుకున్నవాడల్లా మంచం మీద లేచి కూర్చుని దగ్గటం మొదలుపెట్టాడు. ఆగకుండా పెద్ద శబ్దంతో దగ్గుతూనే వున్నాడు. ఆ భవనం రామదాసు దగ్గుతో ప్రతిధ్వనిస్తోంది.

ఆ భవనంలో మిగిలిన గదుల్లో రామదాసు కొడుకులూ, కోడళ్లూ వాళ్ల పిల్లలతో నిద్రకు ఉపక్రమించబోతున్నారు. ఒకసారిగా వాళ్లంతా లేచికూర్చున్నారు.



“వెధవ దగ్గు, కనీసం రాత్రివేళ కంటి నిండుగా నిద్రపోవటానికి కూడా లేదు. పుట్టింటికి వెళ్లి ఓ నెలరోజులు హాయిగా నిద్రపోయి రావాలి. ఈ ముసలాయన ఈ మాయదారి దగ్గుతోనే పోతాడేమో” అన్నది రామదాసు పెద్దకోడలు అన్నపూర్ణ.

“ఈ దగ్గుతో ఈ ఇంట్లో బతకలేం. పగలూ లేదు రాత్రీలేదు. రోజంతా ఒకటే దగ్గు. వేసుకుంటున్న మందులన్నీ యేమవుతున్నాయో. దగ్గు మాత్రం ఈ ముసలాయన్ని వదలటం లేదు. ఇలాగయితే ఈ ఇంట్లో వుండలేం. రేపే నేను మాఊరికి వెళతాను.” అన్నది రామదాసు రెండోకోడలు సువర్చల భర్త లక్ష్మణరావుతో.

“పెద్దతనం కదా... కొంచెం ఓర్చుకో సువర్చలా” అన్నాడు లక్ష్మణరావు అనునయంగా..

“ఓర్చుకోటానికూడా ఒక హద్దుంటుంది. పది రోజుల్నించీ ఒకటే దగ్గు. తగ్గకుండావుంది. డాక్టర్లు ఇచ్చిన మందులన్నీ వాడుతున్నారు. ఐనా తగ్గలేదు. ఇంట్లో ఎవరికీ నిద్ర లేదు. నిద్రలేకుండా ఇంట్లో పనంతా ఎవరు మాత్రం చెయ్యగలరు. మీరే ఆలోచించండి” అన్నది సువర్చల.

లక్ష్మణరావు యేమీ మాట్లాడలేకపోయాడు.

నిజమే పదిహేను రోజులక్రితం అరవయ్యేళ్లు వయసుదాటిన రామదాసు తన తమ్ముడి మనవరాలి పెళ్లి గురించి ఒక పల్లెటూరికి వెళ్లి పదిరోజులక్రితం తిరిగివచ్చాడు. వస్తూనే దగ్గుని వెంటపెట్టుకుని వచ్చాడు. ఆ రాత్రినించే దగ్గటం మొదలు పెట్టాడు. కొడుకులు ఆయన్ని ఒక డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్లారు. ఆ డాక్టరు కొన్ని రకాల పరీక్షలు చేయించి మందులు రాసిచ్చాడు. కానీ వాటిని క్రమం తప్పకుండా వాడుతున్నా ఆ దగ్గు మాత్రం తగ్గలేదు. పెరుగుతూ వచ్చింది. ఆ దగ్గుకు కారణమేమిటో అది ఎలా తగ్గుతుందో ఆ డాక్టరుకు కూడా అర్థం కాలేదు. యేది యేమైనా రామదాసు దగ్గు మాత్రం ఆ ఇంట్లో ఎవరికీ కునుకు లేకుండా చేసింది.

రామదాసు మంచంమీద కూర్చుని ముందుకు వొంగి విరామం లేకుండా దగ్గుతున్నాడు.

కారిడార్ చివరన వున్న పనివాడు రంగయ్య గబగబా వచ్చాడు. వచ్చి రామదాసును మంచం మీద పడుకోబెట్టి గొంతు కిందా, గుండె మీదా అరచేత్తో చిన్నగా రాయటం మొదలు పెట్టాడు. అలా చెయ్యటంతో ఆ దగ్గుతెర క్రమంగా కొంచెం సేపటికి ఉపశమించింది. దగ్గు ఆగిపోయింది. అప్పుడు రామదాసు గట్టిగా వూపిరి పీల్చుకున్నాడు.

అప్పటికి తగ్గిపోయినా ఆ దగ్గు తెర మళ్లీ వస్తుందని నౌకరు రంగయ్యకు తెలుసు. ఈ పదిరోజులనించీ ఇలా జరుగుతూనేవుంది. అందుకే రంగయ్య తన భుజం మీది కండువాని పరచుకొని రామదాసు మంచం పక్కనే పడుకున్నాడు.

నిజానికి రామదాసుకు ఆ దగ్గు మొదలయిన నాలో నించి రంగయ్య కనిపెట్టుకొని వుంటున్నాడు. డాక్టరు ఇచ్చిన మందు బిళ్ళను మింగించటం, మందు తాగించటం, ఛాతీమీదా, గొంతు కిందా అరచేత్తో చిన్నగా రాయటం వంటి పనులన్నీ రంగయ్యే చేస్తున్నాడు. కానీ రామదాసు కొడుకులూ, కోడళ్లు ఎటువంటి సేవా చెయ్యటంలేదు. చెయ్యకపోగా ఆయన దగ్గుతుంటే విసుక్కుంటున్నారు. ఆ రాత్రి రెండు గంటలు దాటాక రామదాసుకు మళ్లీ దగ్గు ముంచుకు వచ్చింది. రంగయ్య వెంటనే ఉపశమన చర్యలు తీసుకొని దాన్ని తగ్గేలా చేశాడు. ఆరాత్రి రంగయ్యకు సరయిన నిద్రలేదు. ఆ విధంగా ఇంకో అయిదు రోజులు గడిచిపోయాయి. ఈ అయిదు రోజుల్లో తగ్గుముఖం పట్టి చివరకు పూర్తిగా తగ్గిపోయింది. ఇంట్లో అంతా తేలిగ్గా నిట్టూర్చి సంతోషాన్ని వ్యక్తపరిచారు. దగ్గు అప్పటికి తగ్గిపోయినా మళ్లీ వస్తుందేమోననే భయంతో మిగిలిన మందు బిళ్లలన్నిటినీ మింగేశాడు రామదాసు. ఒక్క బిళ్లను కూడా మిగల్చలేదు.

మామూలుగా భోజనం చెయ్యగలుగుతున్నందుకు సంతోషపడిపోయాడు. ఇన్నాళ్లూ ఈ దగ్గు భయంతో కడుపునిండా భోజనం కూడా చెయ్యలేదు. ఇక ఇప్పుడాభయంలేదు. రామదాసు బాగా ఆస్థిపరుడు. ఆయనకు ఎన్నో ఎకరాల పొలమూ, ఇతర ఆస్థులూ వున్నాయి. ఆయన కొడుకులు రకరకాల వ్యాపారాలు చేస్తున్నారు. రంగయ్య నౌకరుగా ఆ ఇంట్లోనే వుంటున్నాడు. అతనికి భార్యలేదు. పిల్లలు లేరు. ఒంటరిగా అక్కడే వుంటాడు. రామదాసు భార్య ఆరేళ్లక్రితం క్షయరోగంతో చనిపోయిన నాటినించి రంగయ్య నమ్మినబంటుగా రామదాసుకు అవసరమయిన సేవలన్నిటినీ చేస్తున్నాడు. నెలరోజులు గడిచాయి. రామదాసు భయపడినట్టుగా ఈ నెల రోజుల్లో మళ్లీ దగ్గు రాలేదు కానీ ఊహించని విధంగా ఆ దగ్గు నౌకరు రంగయ్యను పట్టుకున్నది. ఇంతకుముందు రామదాసు లాగానే రంగయ్య దగ్గటం మొదలు పెట్టాడు. కానీ అయిదు రోజులు గడచినా రామదాసు మాత్రం రంగయ్యను యే డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్ళలేదు. మందులు ఇప్పించలేదు. చివరకు ఒకరోజు రంగయ్య దగ్గు బాధను తట్టుకోలేకపోయాడు.

“అయ్యా.. నాకు మందులిప్పించండి’ అనడిగాడు. “కొంచెం నిదానించు రంగయ్యా” అన్నాడు రామదాసు చిరునవ్వుతో.. రంగయ్య ఇక మాట్లాడలేదు. దగ్గు బాధను అనుభవించిన మనిషే అలా చెబుతుంటే తనేం మాట్లాడగలడు? రామదాసు చెప్పిన ఆ నాలుగు రోజులూ గడచిపోయాయి. అయినా రంగయ్య దగ్గు తగ్గలేదు. అతను దగ్గును భరించలేక బాధపడుతున్నాడు. అయినా రామదాసు చూస్తూ వూరుకున్నాడు గానీ డాక్టరుకు మాత్రం చూపించలేదు.

ఇంట్లో కుటుంబ సభ్యులంతా గొడవపెట్టటం మొదలు పెట్టారు. రంగయ్య దగ్గును భరించలేక పోతున్నామనీ, నిద్ర కరువై పోయిందనీ, ఇంతకు ముందు రామదాసు చూపించిన నరకాన్ని ఇప్పుడు రంగయ్య చూపిస్తున్నాడనీ అనటం మొదలు పెట్టారు. అవేకాకుండా ఆ దగ్గు అంటువ్యాధిగా మారి తమక్కూడా చుట్టుకోవచ్చుననే భయాన్ని రామదాసు ఎదుట వ్యక్తపరిచారు.

అప్పుడు రామదాసు రంగయ్య దగ్గు సమస్యకు ఒక పరిష్కారం ఆలోచించాడు. రంగయ్యను దగ్గరకు పిలిచి “రంగయ్యా! నీ దగ్గు ఈ ఇంట్లో అందరికీ ఒక సమస్య అయికూర్చుంది. ఎవరికీ నిద్రలేదు. భరించలేకుండా ఉన్నారు. చివరకు నేనుకూడా భరించలేకపోతున్నాను. ఇంట్లో వుండటానికి భయపడుతున్నారు. అందువల్ల నువ్వు ఒక పని చెయ్యి అన్నాడు. రామదాసు

“యేమిటయ్యా?” అనడిగాడు రంగయ్య ఆశగా...

“ఈ ఇంట్లో పనిమానేసి వెళ్లిపో. ఇంకో మనిషిని పెట్టుకుంటాను. నీ దగ్గును మేము భరించలేము” అన్నాడు రామదాసు. అక్కడినించి వెళ్లిపోయాడు రంగయ్య. దగ్గు సమస్య ఆవిధంగా పరిష్కారమయ్యింది!

- ప్రతాప రవిశంకర్

నిన్నటి దాకా పెన్నులమ్మే కుర్రాడు
నేడు వైద్య విద్యార్థి



ఇదెలా సాధ్యం? అనిపిస్తుంది ఎవరికైనా. కానీ కృషి వుంటే మనుషులు రుషులౌతారు...అన్న పాట గుర్తుతెచ్చుకోండి ఓసారి. అది సుబోధ్ బిస్వాస్ విషయంలో నూటికి నూరుపాళ్లు నిజమైంది. రైళ్లల్లో...బస్సుల్లో పెన్నులమ్ముకొని పొట్టపోసుకొన్న సుబోధ్ ఇవాళ బర్ద్వాన్ మెడికల్ కాలేజీ విద్యార్థి. అయితే ఇది ఒక్కరోజులోనో ఒక్క గంటలోనో జరిగిందికాదు. దీని వెనుక సుబోధ్ పట్టుదల, తపన, కసి, కృషి .... దాగివుంది. మరి ఆ విజయగాథ ఏంటో తెలుసుకొందామా!

బర్ద్వాన్ మెడికల్ కాలేజీ విద్యార్థిగా తొలిసారిగా అడుగెట్టినప్పుడు సుబోధ్ బిస్వాస్ పొందిన ఉద్వేగం అంతా ఇంతా కాదు. అసలది కలా నిజమా అన్న భావన తరగతి గదిలో అడుగెట్టే వరకు అతణ్ణి వదల్లేదు. క్లాసులో కూర్చుని (ఆగస్టు 2న) మొదటి పాఠం నోట్సు రాసుకోవడానికి పెన్ను తీసుకొన్నప్పుడు... అది కల కాదు. నిజమేనని రూఢి చేసుకొన్నాడు. ఆ సంతోష సమయంలో తన చుట్టూ వున్న విద్యార్థులను ఓసారి పరికించి చూశాడు. అంతా పద్దెనిమిదేళ్ల వారు. తనకో! ఇరవైఆరేళ్లు. అవేమీ అతణ్ణి బాధ పెట్టలేదు. పైగా తన గతం...ఒక్కసారి కళ్లముందు మెదిలింది. అప్పటివరకు తన బీదబతుకుతో పెనవేసుకొన్న రైలు బండి కదులుతున్న శబ్దం వినిపించింది.

000

సుబోధ్ స్కూల్లో కూడా ఆలస్యంగానే చేరాడు. తోటి పిల్లలందరిలోకి ఇతనే పెద్దవాడు. అసలు చిన్నతనం నుంచి బతుకు పోరు చేయడం సుబోధ్‌కు అలవాటే. పసివాడిగా వున్నప్పుడే అమ్మానాన్నలను కోల్పోవడంతో అన్న సుఖ్‌లాల్ పంచన చేరాడు. అతను వడ్రంగి పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. నెలకు వచ్చే రెండు మూడు వేల రూపాయలతో కుటుంబాన్ని నెట్టుకురావడం కష్టంగానే వుండేది. 2003వ సంవత్సరం వరకు తన చదువుకు అన్న సుఖ్‌లాల్ సహాయం అందింది. అప్పటికి హబ్రాలోని బాగచి కాశీబాల విద్యాపీఠంలో 71 శాతం మార్కులతో మధ్యమిక పాసయ్యాడు. ఆ తర్వాత అన్న పెళ్లి చేసుకోవడంతో తనకోసం తను సంపాదించాల్సిన అవసరం ఏర్పడింది. కానీ చదువును మాత్రం వదిలిపెట్టదలచుకోలేదు. ఎలాగైనా కొనసాగించాలనుకొన్నాడు. పొరుగున వుండే ఓ పెద్దమనిషి సుబోధ్‌ను హోల్‌సేల్ పెన్నుల వ్యాపారికి పరిచయం చేశాడు. అప్పటినుంచి స్థానిక రైళ్లలో, బస్సుల్లో పెన్నులు అమ్మసాగాడు. నాలుగేళ్లపాటు స్థానిక సెల్దా-బాంగాన్ రైళ్లలో, కలకత్తా వెళ్లే బస్సుల్లో పెన్నులు అమ్మి రోజుకు 100-150 రూపాయల వరకు సంపాదించేవాడు. తనకు వచ్చే ఆ కొద్దిపాటి డబ్బుతోనే తిండీ, చదువూ... అన్నీ. అయితే ఇందుకోసం ఉదయం 7 గంటలకు ఇంటి నుంచి బయటపడితే తిరిగి ఇల్లు చేరేసరికి రాత్రి 9 గంటలయ్యేది. ఆ తర్వాతే చదువు. ఇదంతా చాలా కష్టంగా వుండేది. కానీ తన కల సాకారం కావాలంటే తప్పదుమరి.

2005లో హయ్యర్ సెకండరీ ఎగ్జామ్ పాసయ్యాడు. అదీ 61 శాతం మార్కులతో. అప్పుడే జాయంట్ ఎంట్రన్స్ టెస్ట్ రాయాలని నిర్ణయానికొచ్చాడు. అందుకు ఇరుగుపొరుగు సాయం చేశారు. ఓ ప్రయివేటు మాష్టారు ఉచితంగా పాఠాలు చెప్పారు. కష్టం ఫలించి మెరిట్ లిస్ట్‌లో 77 వ ర్యాంక్ సంపాదించాడు. కానీ పేదరికం కారణంగా ఉత్తర బెంగాల్‌లో డెంటల్ కాలేజ్‌లో వచ్చిన సీటును వదులుకోవాల్సి వచ్చింది. రెండేళ్ల తర్వాత మళ్లీ జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ రాశాడు. ఈసారి ఉత్తర బెంగాల్ మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. కానీ ఈసారికూడా ప్రవేశరుసుము కట్టలేక అప్పటికి ఆగిపోయాడు. ఈ రెండు సంఘటనలతో అతను బాగా కుమిలిపోయాడు. తన కల కల్ల కావాల్సిందేనా అనుకొన్నాడు. మరి తర్వాత ఎలా ముందడుగు వేశాడు?!

మరుసటి సంవత్సరం భవన నిర్మాణ కార్మికుడిగా ఢిల్లీ వెళ్లాడు. కానీ ఆఖరుసారిగా అదృష్టాన్ని పరీక్షించుకొనేందుకు ఆరునెలలకే తిరిగి వచ్చేశాడు. ఓవైపు హబ్రాలోని ఆయుర్వేద మందుల షాపులో ఉద్యోగం చేస్తూనే మరోవైపు పరీక్షకు చదువుకోసాగాడు. మూడవసారి ప్రవేశ పరీక్ష రాశాక కూడా అతనిలో ఒకటే ప్రశ్న సుడులు తిరిగింది. ఈసారైనా ఫీజు కట్టగలనా? లేదా? అని తపన పడిపోయాడు. చివరకు రవీంద్రనాథ్ టాగూర్ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కార్డియాక్ సైన్సెస్ రూపంలో అతనికి ఆపన్న హస్తం అందింది. వారు ఆర్థికసాయం అందించనున్న పన్నెండుమంది పేద మెరిట్ విద్యార్థుల్లో సుబోధ్ ఒకడు. అలా ఎంబిబిఎస్ పూర్తిచేసే అవకాశం లభించిందతనికి. ఇంత వరకు ఓవైపు ఏదో ఒక పని చేసుకుంటూనే చదువుకున్నా.... జీవితంలో మొదటిసారిగా ఇతర విద్యార్థుల్లా చదువుకొనే అవకాశం అభించిందతనికి (స్కాలర్‌షిప్ మీదే అనుకోండి). స్కాలర్‌షిప్ కాక మరో మూడు వేల రూపాయల అప్పు చేశాడు. పైగా సీనియర్లు పుస్తకాలందించారు.

ఎంబిబిఎస్‌లో చేరాక సుబోధ్ ఆత్మవిశ్వాసం బలపడింది. భవిష్యత్ స్వప్నం త్వరలో సాకారమౌతుందన్న నమ్మకం కలిగింది. ★

బాబోయ్ వైరస్! డేటా జాగ్రత్త!

కంప్యూటర్లను ఉపయోగించి, అనేక పనులను సక్రమంగా నిర్వహించాలంటే, వాటికి ఎటువంటి అంతరాయం కలుగకూడదు. కాని కంప్యూటర్ వైరస్‌లు, కంప్యూటర్లను సక్రమంగా పనిచేయకుండా నిలిపివేస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది యూజర్లు ఏదో ఒక విధంగా ఈ పరిస్థితిని ఎదుర్కొంటూ ఉంటారు. 1970 నుంచే ఈ వైరస్‌ల బెడద మొదలైంది. సిఐహెచ్, మెలిసా, ఐలవ్‌యూ... వంటి అనేక వైరస్‌లు ఇటీవల కాలంలో కోట్ల రూపాయల నష్టాన్ని కల్గించాయి. ముఖ్యంగా ఇవి హార్డ్‌వేర్ కాంపొనెంట్స్‌ను పాడు చేయడంతోపాటు కీలకమైన డేటాను కూడా పాడు చేస్తున్నాయి. దీంతో నేడు ప్రపంచవ్యాప్తంగా నెట్ ద్వారా లేదా ఇతర సాధనాల ద్వారా వైరస్‌లు ఎక్కువగా వ్యాపించి అధిక నష్టాన్ని కలిగిస్తూనే ఉన్నాయి. పిసి యూజర్ల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. దీనికి పరిష్కారంగా వైరస్‌ల గురించి తెలుసుకుని అవి రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం ఒక్కటే మార్గం.

- కె. ఎక్స్.రాజు

ఒక పద్ధతి ప్రకారం రాసిన నియమాల సమూహాన్ని ప్రోగ్రాం అంటారు. కొన్ని ప్రోగ్రామ్‌లు మాత్రం కంప్యూటర్లను, పనిచేయకుండా నిలిపేస్తాయి. అదే విధంగా డేటా, ప్రోగ్రాంలను కూడా నాశనం చేస్తాయి. ఇటువంటి ప్రోగ్రాంలనే కంప్యూటర్ వైరస్‌లని పిలుస్తారు. ఈ ప్రోగ్రాంలు కంప్యూటర్‌లోకి ప్రవేశించిన తర్వాత వాటంతట అవే వేగంగా వ్యాప్తి చెందుతాయి. తద్వారా కంప్యూటర్‌లోని మొత్తం సమాచారం, అనేక ప్రోగ్రాంలు (లేక) సాఫ్ట్‌వేర్లు తుడిచి పెట్టుకుపోతాయి. అయితే ఇటీవల వస్తున్న వైరస్‌లు చాలా ప్రమాదకరంగా తయారవుతున్నాయి. వీటి లక్ష్యం ఒక డేటా, ప్రోగ్రాంలే కాకుండా, హార్డ్‌డిస్కులు కూడా సాధారణంగా వైరస్ ఎక్సిక్యూటబల్ ప్రోగ్రాంకు ఎటాచ్ చేయబడి ఉంటుంది. ఎప్పుడైతే యూజర్ మెమరీ నుంచి ఎగ్జిక్యూటబుల్ ప్రోగ్రాంను ఎక్సిక్యూట్ చేస్తాడో, వెంటనే ఆ ప్రోగ్రాంతో పాటు వైరస్ కూడా యాక్టివేట్ అవుతుంది. ఆ తర్వాత వైరస్‌ను గుర్తించే లోపునే, కంప్యూటర్ మొత్తం దానికై అదే కాపీ అయి వేగంగా వ్యాప్తి చెందుతుంది.

వైరస్ ... ఎలా? ఎందుకు?

ప్రపంచవ్యాప్తంగా అనేక రకాల వైరస్‌లను తయారు చేస్తున్నారు. అయితే ఈ వైరస్‌లు ఎలా వ్యాప్తి చెందుతాయో, తెలుసుకుందాం. వైరస్ సోకిన ప్రోగ్రాం, డేటా మెమరీలోకి లోడ్ అయి ఉంటే, అది అక్కడే ఉంటుంది. ఆ తర్వాత కొత్తగా ప్రవేశపెట్టిన ప్రోగ్రాంలు, డేటా మెమరీ నుంచి రిమూవబుల్ డిస్క్ అంటే ఫ్లాపీ డిస్క్, సి.డిలు... మొదలగు వాటిలోకి కాపీ చేస్తుంటారు. ఇటువంటి డిస్క్‌లను వేరొక కంప్యూటర్లలో ఉపయోగించడం ద్వారా వైరస్‌లు వ్యాప్తి చెందుతాయి. వైరస్‌ల వ్యాప్తికి నెట్‌వర్క్‌లు అంటే ల్యాన్ (లోకల్ ఏరియా నెట్‌వర్క్), వ్యాన్ (వైడ్ ఏరియా నెట్‌వర్క్), బి.బి.యస్ (బులెటిన్ బోర్డ్ సిస్టం)... వంటివి ముఖ్య సాధనాలుగా మారాయి. ముఖ్యంగా ఇంటర్‌నెట్ ద్వారా కూడా వేగంగా వైరస్‌లు వ్యాప్తి చెందుతాయి. ఎప్పుడైతే ఒక కంప్యూటర్‌లోని వైరస్ సోకిన ప్రోగ్రాంలు లేక డేటా నెట్‌వర్క్ సిస్టంలోకి ప్రవేశిస్తాయో, వెంటనే ఒక కంప్యూటర్ నుంచి వేరొక కంప్యూటర్‌కు వ్యాప్తి చెందుతాయి. ఉదాహరణకు కంప్యూటర్ యూజర్ ఇంటర్‌నెట్ నుంచి వైరస్ సోకిన ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న వెంటనే, వైరస్ అతని కంప్యూటర్‌లోకి కూడా ప్రవేశిస్తుంది. అదే విధంగా మోడెమ్‌ను ఉపయోగించి ఫైల్స్‌ను ట్రాన్స్‌ఫర్, రిసీవ్ చేసుకోవడం ద్వారా కూడా వైరస్‌లు వ్యాప్తి చెందుతాయి. ఒక విధంగా చెప్పాలంటే, వైరస్‌లను నిరోధించడానికి తగు జాగ్రత్తలు తీసుకోకపోతే, ఎప్పుడైనా ప్రవేశించేందుకు అవకాశాలు ఉన్నాయి. మొట్టమొదట్లో చట్ట వ్యతిరేకంగా వాడే సాఫ్ట్‌వేర్‌లను నిరోధించేందుకు ఈ వైరస్‌లను తయారు చేసేవారని పలువురు నిపుణులు అభిప్రాయపడేవారు. మానసిక శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం, నేటి వైరస్ సృష్టికర్తల ముఖ్య ఉద్దేశ్యం, తాము సృష్టించిన వైరస్‌ల వలన కలిగే నష్టాలను చూసి ఆనందాన్ని పొందడమే!

బూట్ వైరస్

వైరస్‌లు వ్యాప్తిచెందే విధాన్ని బట్టి, వివిధ రకాలుగా విభజించారు. వైరస్‌లలోని పలు రకాలలో బూట్ వైరస్ ఒకటి. ఈ రకం వైరస్‌లు ఫ్లాపీడిస్క్ బూట్ రికార్డు లేక హార్డ్‌వేర్ డిస్క్‌లోని మాస్టర్ బూట్ రికార్డ్‌కు సోకుతాయి. ఇందులోకి ప్రవేశించిన తర్వాత బూట్ రికార్డ్ ప్రోగ్రాంను, వైరస్ అక్కడి నుంచి తొలగించడం కానీ, ఒవర్ రైట్ చేయడం కానీ చేస్తుంది. బూట్ వైరస్‌లు బూటింగ్ సమయంలో కంప్యూటర్ మెమరీలోకి లోడ్ అవుతాయి. ఫార్మ్, డిస్క్ కిల్లర్, స్టోన్ వైరస్... మొదలైనవాటిని ఈ రకం వైరస్‌కు ఉదాహరణలుగా చెప్పవచ్చు.

వైరస్ నివారణ కోసం...

☆ఇతర కంప్యూటర్లపై ఫ్లాపీడిస్క్‌లను ఉపయోగించేటపుడు వైరస్ చెక్ చేసుకోవాలి.

☆బూటింగ్ సమయంలో ఫ్లాపీడిస్క్‌లను డ్రైవ్‌లో ఉంచకుడా తీసివేయాలి. ఒకవేళ ఫ్లాపీతోనే బూటింగ్ చేయాల్సి ఉంటే, స్టార్టప్ లేదా రెస్క్యూ డిస్క్‌లను ఉపయోగించాలి.

☆పైరేటెడ్ సాఫ్ట్‌వేర్ సిడిల నుంచి వైరస్‌లు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. సాధారణంగా సిడిలలో డేటాను రైట్ చేసే సమయంలో వైరస్ చెక్ చేసి రైట్ చేస్తారు. ఒక్కసారి సిడి రామ్‌లలో డేటాను రైట్ చేసిన తర్వాత పలుమార్లు రీడ్ చేస్తారు. సిడి రామ్‌లలోకి ఒకసారి రైట్ చేసిన తర్వాత మళ్ళీ రైట్ చేయలేం. కావున వైరస్ సిడిరోమ్‌లను ఏ సిస్టంలో ఉపయోగించినప్పటికీ ప్రవేశించదు.

☆ఇంటర్‌నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే ఫైల్స్‌ను గమనించాలి. ముఖ్యంగా గేమ్స్, ఫ్రీవేర్స్, స్క్రీన్‌సేవర్స్... మొదలైనవి.

☆ప్రతినెల యాంటీ వైరస్ సాఫ్టవేర్‌ను అప్‌డేట్ చేయటం ఉత్తమం. దీనివలన యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్ శక్తివంతంగా తయారయ్యే వైరస్‌ను కనుగొని నిర్మూలిస్తుంది.

☆వారానికి ఒక్కసారి మొత్తం హార్డ్‌డిస్క్‌ను స్కాన్ చేయాలి.

☆రెస్క్యూ డిస్క్‌ను తయారుచేసి ఉంచుకోవటం ఎంతైనా అవసరం.

☆అనుమానిత ఫైల్స్‌ను గుర్తించటం కోసం వాచ్‌గార్డ్ ప్రోగ్రామ్స్ (మానిటర్స్ అనిపిలుస్తారు)ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి.

☆ఆపరేటింగ్ సిస్టంను సిద్ధంగా ఉంచుకోవటం ద్వారా వైరస్ సంభవించినపుడు, హార్డ్‌డిస్క్‌ను ఫార్మాట్ చేసి, ఆపరేటింగ్ సిస్టంను రీ ఇన్‌స్టాల్ చేసుకునే అవకాశం ఉంది.

ప్రోగ్రాం వైరస్‌లు

ప్రోగ్రాం వైరస్‌లు ప్రోగ్రాంలో ప్రవేశించి వ్యాప్తి చెందుతాయి. ఈ రకం వైరస్‌లు .bin,.com,.exe,.ovl,.drv,.sys మొదలగు ఎక్స్‌టెన్షన్స్‌ను కలిగిన ప్రోగ్రాం ఫైల్స్‌కు సోకుతాయి. మెమరీలో నిల్వ చేసిన ఈ ప్రోగ్రామ్స్ ఎక్సిక్యూట్ అయినప్పుడు, వీటితోపాటు వుండే వైరస్‌లు కూడా యాక్టివేట్ అయి హార్డ్‌వేర్ డిస్క్‌లోని ఫైల్స్‌కు వ్యాప్తిచెంది వాటిని నాశనం చేస్తాయి. సండే, కాస్‌కేడ్ మొదలైన వాటిని ఈ రకం వైరస్‌లుగా చెప్పవచ్చు.

మల్టీ పార్‌టైట్ వైరస్‌లు

బూట్ వైరస్ మరియు ప్రోగ్రాం వైరస్‌లు కలవగా ఏర్పడిన కొత్త వైరస్ ఈ మల్టీ పార్‌టైట్ వైరస్. ఈ రకం వైరస్ ముందుగా ప్రోగ్రాం ఫైల్స్‌కు సోకుతుంది. వైరస్ సోకిన ప్రోగ్రామ్ ఎప్పుడైతే ఎగ్జిక్యూట్ అవుతుందో, అప్పుడు ఈ వైరస్‌లు బూట్ రికార్డుకు కూడా వ్యాప్తి చెందుతాయి. ఆ తర్వాత కంప్యూటర్‌ను బూట్ చేసినప్పుడు బూట్ రికార్డ్‌లోని వైరస్ మెమరీలోకి లోడ్ అయి డిస్క్‌లోని ప్రోగ్రాం ఫైల్స్‌కు వ్యాప్తి చెందుతుంది. ఇనవేడర్, ఫ్లిప్, టిక్విల్లా, మొదలైన వాటిని మల్టీ పార్‌టైట్ వైరస్‌లకు ఉదాహరణలుగా చెప్పవచ్చు.

స్టీల్త్ వైరస్‌లు

ఇటువంటి వైరస్‌లను స్కాన్ చేసి కనిపెట్టడం కష్టమే! ఈ రకం వైరస్‌లు స్కానింగ్ సమయంలో కనపడకుండా, కొన్ని రకాల టెక్నిక్స్‌ను ఉపయోగించి తప్పించుకుంటాయి. వైరస్‌ల కోసం డిస్క్ హెడ్ రీడ్ చేసే సమయంలో దానిని రీడైరెక్టు చేస్తాయి. అంటే డిస్క్ హెడ్ ఈ వైరస్‌లున్న సెక్టార్‌ను స్కాన్ చేయకుండా వేరే సెక్టర్‌ను స్కాన్ చేస్తుంది. ఇంకా ఇవి డైరెక్టరీ లిస్టింగ్‌లో ఉండే ఫైల్ సైజ్‌ను మార్చివేస్తాయి. దీని కారణంగా వీటిని స్కాన్ చేసి కనుగొనడం కష్టమే! ఫ్రోడోజోషి, వేలే మొదలైనవన్నీ ఈ రకం వైరస్‌లే.

పాలీమార్ఫిక్ వైరస్‌లు

ఈరకం వైరస్‌లు వాటి కోడ్స్‌ను వివిధ రకాల పద్ధతులలో మార్చుకొని ఉంటాయి. కంప్యూటర్లకు సోకినప్పుడు, వివిధ సమయాలలో వివిధ రూపాలను కలిగి ఉంటాయి. అందువలన ఇటువంటి వైరస్‌లను కనుగొని తొలగించడం కష్టమే ఇన్‌వాలంటరీ, స్టిమ్‌లేట్, కాస్‌కేడ్, ఈవిల్ వైరస్ 101... మొదలైనవి ఈ రకం వైరస్‌లే.

మాక్రో వైరస్‌లు

డాక్యుమెంట్ లేక టెంప్‌లెట్స్‌లోని మాక్రోస్‌కు ఈ వైరస్ సోకుతుంది. స్ప్రెడ్‌షీట్ లేదా వర్డ్ ప్రాసెసర్ డాక్యుమెంట్‌ను తెరిచినప్పుడు ఈ వైరస్ యాక్టివేట్ అయి నార్మల్ డాట్ అనే ఫైల్‌లోకి చేరుతుంది. ఓపెన్ చేసే ప్రతి డాక్యుమెంట్ డాక్యుమెంట్ సెట్టింగ్స్ కోసం నార్మల్ డాట్ ఫైల్‌ను కలుస్తుంది. దీంతో డాక్యుమెంట్‌కు ఈ వైరస్ సుళువుగా చేరుతుంది. డిఎమ్‌వి న్యూక్లియర్, వర్డ్ కాన్సెప్ట్... మొదలైనవన్నీ మాక్రో వైరస్‌లే.

వైరస్ లక్షణాలు

కంప్యూటర్‌ను ఉపయోగించే ముందు లేక ఉపయోగించేటప్పుడు ఈ కింది సమస్యలు ఎదురైతే వైరస్ సోకినట్లు నిర్ధారణ చేసుకోవచ్చు. ప్రోగ్రాంలు లోడ్ కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. మెమరీ సంబంధిత ఆపరేషన్స్ నెమ్మదిగా రన్ అవుతాయి. డిస్క్ స్పేస్, ఫైల్ సైజ్ పెరుగుతుంది. అదే విధంగా ఫైళ్ల తయారు చేసిన తేదీలు తారుమారవుతాయి. ఫ్లాపీ డిస్క్, హార్డ్‌డిస్క్‌లు సరిగా పనిచేయవు. కంప్యూటర్ హార్డ్‌వేర్, డిస్క్‌లోని పార్టీషన్ టేబుల్ కనుగొనడంలో విఫలమౌతుంది. దీంతో కంప్యూటర్ బూట్‌కాదు. రైట్ ప్రొటెక్టు ఎర్రర్స్ సందర్భం లేకుండా వేస్తాయి. హార్డ్ డిస్క్‌లోని ఫైల్స్ తుడిచిపెట్టుకుపోతాయి. ఫైళ్లను వెతికి పట్టుకోవడం కష్టం.

డైరెక్టరీ లిస్టింగ్‌లో ఫైల్స్ నేమ్స్ కొత్త క్యారెక్టర్స్ కలిగి ఉంటాయి. కొత్త కొత్త, మెసేజ్‌లు స్క్రీన్‌పైన డాక్యుమెంట్స్‌లోనూ డిస్‌ప్లే అవుతాయి. అదే విధంగా కొత్త గ్రాఫిక్స్ కూడా డిస్‌ప్లే అవుతాయి. ప్రోగ్రామ్స్ కోడ్ కరప్ట్ అవుతుంది. దీంతో ప్రోగ్రాంలు పనిచేయకుండా నిలిచిపోతాయి. కంప్యూటర్ కూడా పనిచేయదు. డాక్యుమెంట్ లేక డేటా ఫైల్స్‌లోని టెక్స్ట్‌పై, కొన్ని రకాల క్యారెక్టర్స్ ఓవర్ రైట్ అవుతాయి. ఫైల్స్‌ను కాపీ చేయకుండానే కాపీ అయినట్టు సమాచారం వస్తుంది.

మీ సిస్టమ్‌లో వైరస్ ఉందా?

సిస్టంలో వైరస్ ఉందని తెలుసుకోవడానికి ఉపయోగపడే పది మార్గాలు కింది విధంగా ఉన్నాయి.

–ప్రోగ్రామ్స్ లోడ్ కావటానికి ఎక్కువ సమయం పడుతుంది. అంటే మెమరీ సంబంధిత ఆపరేషన్లు నెమ్మదిగా పని చేస్తాయి.

–డిస్క్ స్పేస్‌ను ఉపయోగించిన దానికంటే ఎక్కువగా కన్పిస్తుంది. ఫైల్ సైజ్‌లు కూడా పెరిగినట్టు కన్పిస్తాయి.

–డైరెక్టరీలోని ఫైల్ నేమ్స్ డేట్స్, మారటం, ఫైల్స్ కరప్ట్ కావటం జరుగుతుంది.

–ఫ్లాపీ డిస్క్, హార్డ్ డిస్క్ సైజ్ మారటం, ఫైల్స్ కరప్ట్ కావటం జరుగుతుంది.

–విండోస్ కంట్రోల్ ప్యానెల్‌లోని ముఖ్యమైన ఫైల్స్ పనిచేయకుండా నిలిచిపోతాయి. సాధారణంగా వైరస్ సోకిన సందర్భాలలో ఈ ఫైల్స్ ఓపెన్ చేసినప్పటికీ ఓపెన్ కావు.

–ఫైల్‌నేమ్స్ లిస్ట్ చేయబడిన డైరెక్టరీలో కొత్త క్యారెక్టర్స్ కన్పిస్తాయి. డిస్క్‌లోని డేటా ఏరియాలో వైరస్ నిల్వ అయే ఫైల్ మాదిరిగా కన్పిస్తుంది. దీంతో వైరస్ లేదనే భావన రావటం సహజం.

–కొత్త కొత్త మెసేజ్‌లు స్క్రీన్‌పై డిస్ అవుతాయి.

–మెసేజ్‌లే కాకుండా ఎప్పుడూ చూడని గ్రాఫిక్స్ కూడా డిస్‌ప్లే అవుతాయి.

–కొన్ని రకాల ప్రోగ్రామ్స్ కోడ్‌ను కరప్ట్ చేయడం వలన ప్రోగ్రామ్స్ పనిచేయవు.

–జంక్ క్యారెక్టర్స్ డాక్యుమెంట్ లేదా డేటా ఫైళ్లలోని టెక్స్ట్‌పై ఓవర్‌రైట్ అయి ఉంటాయి. తద్వారా డేటాను రీడ్ చేసే అవకాశం ఉండదు. ఈ విధంగా పైకారణాలను బట్టి వైరస్ సిస్టంలో ఉందని గ్రహించగలం.

★



పెద్దలు కుదిర్చిన పెళ్లి, ప్రేమ పెళ్లి, రిజిస్టర్ మ్యారేజీ...ఇలా పెళ్లిళ్లలో రకరకాలున్నాయి. ఒకవేళ మనకు నచ్చిన అమ్మాయో, అబ్బాయో దొరక్కపోతే వెదికిపెట్టడానికి ఇప్పుడు మ్యారేజ్ బ్యూరోలు కూడా వెలిశాయి. వివిధ కులాలకు చెందిన మ్యారేజ్ బ్యూరోల గురించో లేదా మతాలకు చెందిన మ్యారేజ్ బ్యూరోల గురించో మనం ఇప్పటి వరకు వినిఉంటాం. కానీ హెచ్ఐవి మ్యారేజ్ బ్యూరో గురించి విన్నారా? అసలీ హెచ్ఐవి/ఎయిడ్స్ మార్యేజ్ బ్యూరో ఏంటి? అని ఆశ్చర్యపోతున్నారా? అయితే ఆ మ్యారేజ్ బ్యూరో, దాని కథా కమామిషు ఏంటో తెలుసుకుందాం రండి.....

- బి.వి.యన్.పద్మరాజు

పాజిటివ్ పెళ్లిళ్ళు

హైదరాబాద్ నుండి విజయవాడ వెళ్లే రహదారిలో దిల్‌సుఖ్‌నగర్ దాటగానే కొత్తపేట పండ్ల మార్కెట్ ఉంది. అక్కడి నుండి కుడివైపుకు తిరిగితే సరూర్‌నగర్ హుడా కాంప్లెక్స్ వస్తుంది. ఆ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న పార్కు సమీపాన ఇద్దరు మనుషులు పట్టే ఒక చిన్న గది. అందులో రెండు కుర్చీలు...ఒక చిన్న బల్ల. ఎర్ర రంగుతో ఉన్న ఆ గది లోపల, వెలుపల గోడలనిండా హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాధిని ఎలా నివారించాలి? వ్యాధి సోకిన వారు ఎలాంటి ఆహారాన్ని తీసుకోవాలి? వ్యాధిగ్రస్థులకు మనం ఎలాంటి మనోధైర్యాన్ని కల్పించాలి? అనే సూచనలు, సలహాలతో కూడిన వ్యాఖ్యలు రాసి ఉన్నాయి. ఆ గదిలోని ఓ కుర్చీలో కూర్చుని వచ్చిపోయే వారిని ఓ వ్యక్తి చిరునవ్వుతో పలకరిస్తూ ఉంటారు. ఆయనే శ్రీనివాస హనుమత్ ప్రసాద్. ఈయనే పైన చెప్పిన హెచ్ఐవి/ఎయిడ్స్ మార్యేజ్ బ్యూరోకి రూపశిల్పి. హెచ్ఐవి వ్యాధిగ్రస్థులకు వివాహాలు జరిపించే 'పాజిటివ్ పెళ్లిళ్ల పేరయ్య'. ఈ మ్యారేజ్ బ్యూరోతోపాటు హైదరాబాద్ నగరంలోని నాగోల్‌లో హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్థుల కోసం ఒక 'ప్రత్యేక' హాస్టల్‌ను సైతం నిర్వహిస్తూ వారికి తన వంతు చేయూతనిస్తున్నారు.

మాకూ తోడు కావాలి!

శ్రీనివాస హనుమత్ ప్రసాద్ స్వస్థలం గుంటూరు జిల్లా నరసరావుపేట. ఆ పట్టణంలోని బరంపేటలో తన చుట్టూ ఉన్న వారిలోనే 10 మంది ఎయిడ్స్ వ్యాధితో మరణించటం ఆయనను కలచివేసింది. దీంతో ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులకు ఏదో చేయాలన్న బలమైన భావన, తపన ఆయన్ను వెంటాడింది. సొంత ఊళ్లో ఓ కళాశాల నడుపుకునే ఆయన ఈ ఆలోచన వచ్చిందే తడవుగా స్వస్థలాన్ని వదిలేసి హైదరాబాద్‌కు చేరుకున్నారు. హెచ్ఐవి పాజిటివ్ నెట్‌వర్క్ అనే స్వచ్ఛంద సంస్థ (ఎన్జీవో)లో 5 సంవత్సరాలపాటు పనిచేశారు. విధుల్లో భాగంగా ఎయిడ్స్ వ్యాధి వ్యాపించే విధానం, వ్యాధి లక్షణాలు, నివారణా మార్గాలు, వ్యాధిగ్రస్థులు తీసుకోవాల్సిన ఆహారం తదితర విషయాలపై విస్తృత ప్రచారం చేశారు. అదే క్రమంలో ఆయన ఎంతోమంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులను స్వయంగా కలుసుకున్నారు. వారి జీవన పరిస్థితుల్ని పరిశీలించారు. సాధక బాధకాలను, కష్టనష్టాలను విని చలించిపోయారు. ముఖ్యంగా చుట్టూ ఉన్న సమాజం వారిని తోటి మనుషులుగా గుర్తించకపోవటం ప్రసాద్‌ను కలిచివేసింది. ఎన్జీవోలో పనిచేసే సందర్భంలోనే ఎంతోమంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు ఒక తోడును (జీవిత భాగస్వామిని) కోరుకుంటున్నారనే విషయాన్ని ఆయన గమనించారు. 'మేమూ మనుషులమే..ఆనందం, విషాదం పంచుకోడానికి మాకూ ఒక తోడు కావాలి' అనే వారి ఆవేదనను ప్రసాద్ మంచి మనసుతో అర్థంచేసుకొన్నారు. అదే క్షణంలో హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులకు ఒక మ్యారేజ్ బ్యూరోని నెలకొల్పాలని సంకల్పించారు. అనుకోవటమే కాదు..2008 మేలో మ్యారేజ్ బ్యూరోని ఏర్పాటుచేసి సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 83 హెచ్ఐవి/ఎయిడ్స్ సోకిన జంటలకు పెళ్లిళ్లు చేసి వారికి తోడు, నీడను కల్పించారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు...నానాటికీ క్షీణిస్తున్న ఆరోగ్యం, చిన్నచూపు చూస్తున్న సమాజం, వివిధ ఆలోచనలతో కుంచించుకుపోతున్న మస్తిష్కం....నిజ జీవితంలో వారు అనుభవించే బాధలు, గాథలివి. పరిస్థితులన్నీ అనుకూలంగా ఉన్న వ్యక్తులకే సరిజోడును వెదకటం పెద్దపని. అలాంటిది హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాధి సోకిన వ్యక్తికి అదే వ్యాధి సోకిన వారిని వెదికి పెళ్లి చేయటం కత్తిమీద సాములాంటిదే. 'ఎన్నో మ్యారేజ్ బ్యూరోల గురించి విన్నాం, చూశాం. కానీ ఈ హెచ్ఐవి/ఎయిడ్స్ మ్యారేజ్ బ్యూరో ఏంట్రా? బాబూ' అంటూ స్నేహితులు, బంధువులు, తెలసినవాళ్లు, చుట్టూ ఉన్న సమాజం 'ఎగతాళి' చేసింది. వాటన్నింటినీ పట్టించుకోకుండా ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులను 'తాళి' బంధంతో ఒకటి చేస్తున్న ప్రసాద్ తాను చేస్తున్న ఈ పని ద్వారా ఎంతో సంతృప్తిని పొందుతున్నానంటున్నారు.

విస్తృత ప్రచారం

ఏదైనా ఒక పనిని విజయవంతంగా పూర్తి చేయాలంటే దానికి ముందు ప్రచారం నిర్వహించాలి. ప్రసాద్‌కు తాను నిర్వహించాలనుకున్న హెచ్ఐవి/ఎయిడ్స్ మ్యారేజ్ బ్యూరో గురించి ఎలా ప్రచారం చేయాలో మొదట్లో అర్థం కాలేదు. ఆ తర్వాత మెరుపులాంటి ఆలోచన తట్టింది. తమకు హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాధి సోకిందనే అనుమానం వచ్చిన వారు వ్యాధి నిర్ధారణ కోసం జిల్లాల్లోని ఎఆర్‌టి సెంటర్లకు వస్తారు. వ్యాధి సోకిన వారు కౌన్సిలింగ్, చికిత్స నిమిత్తం తమ దగ్గరలోని ఎ.ఆర్.టి సెంటర్లు లేదా ఏరియా ఆస్పత్రులకు వస్తారు. ఈ విషయాన్ని గమనించి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఎ.ఆర్.టి సెంటర్లు, ఏరియా ఆస్పత్రులను సందర్శించారు. ఆయా ఆస్పత్రుల గోడలపై తన మ్యారేజ్ బ్యూరో గురించిన అన్ని వివరాలను తెలిపే వాల్‌పోస్టర్లను పెద్దఎత్తున అంటించారు. ఇంతేకాకుండా అన్ని జిల్లాల్లో ప్రముఖమైన ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లి, అక్కడి వైద్యులకు తాను చేపట్టబోయే కార్యక్రమాన్ని గురించి వివరించారు. ఆ ప్రయివేటు ఆస్పత్రుల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. చికిత్స నిమిత్తం వచ్చే ఎయిడ్స్ రోగులకు హెచ్ఐవి/ఎయిడ్స్ మ్యారేజ్ బ్యూరో గురించి వివరించాల్సిందిగా ప్రయివేటు వైద్యులను అభ్యర్థించారు. ఇంతగా ప్రయత్నించినప్పటికీ మ్యారేజ్ బ్యూరోకు పెద్దగా స్పందన రాలేదు.

హెచ్ఐవి పాజిటివ్‌తో జీవించే వారు పెళ్లి కోసం తమ ఫోటోను మ్యారేజ్ బ్యూరోకు పంపిస్తే వేరే వారికెవరికైనా చూపిస్తారేమోననే సందేహం వ్యక్తం చేసేవారు. ప్రసాద్‌కు తమ ఫోటోను అప్పగిస్తే ఆయన తమ గురించి, తమకు సోకిన వ్యాధి గురించి నలుగురికి చెబుతారేమోననే భయాందోళనలకు వారు గురయ్యేవారు. ఆ తర్వాత ఎ.ఆర్.టి సెంటర్లు, ఏరియా ఆస్పత్రులు, ప్రయివేటు డాక్టర్లు మ్యారేజ్ బ్యూరో గురించి పూర్తిగా వివరించటంతో పెళ్లి చేసుకోవాలనుకున్న వారి అనుమానాలు పటాపంచలయ్యాయి. మ్యారేజ్ బ్యూరోని సంప్రదించే వారి సంఖ్య క్రమక్రమంగా పెరిగింది.



అర్హతలు... ఫీజులు...

'హెచ్ఐవి సోకింది కాబట్టి... నేను హెచ్ఐవి/ఎయిడ్స్ మ్యారేజ్ బ్యూరోకి వెళ్లాను, నాకు పెళ్లి చేయండి' అంటే ఒప్పుకోరు ప్రసాద్. తన మ్యారేజ్ బ్యూరో ద్వారా పెళ్లి చేసుకోవాలంటే కచ్చితంగా కొన్ని అర్హతలు ఉండి తీరాలంటారు. అవేంటంటే...

– హెచ్ఐవి పాజిటివ్ అని తెలియాలి. పెళ్లి చేసుకోవాలనుకునే వ్యక్తికి మాత్రమే ఈ విషయం తెలిస్తే సరిపోదు, ఆ వ్యక్తి తల్లిదండ్రులకు (తల్లిదండ్రులు లేకపోతే రక్త సంబంధీకులకు) కూడా తన కుమారుడు లేదా కుమార్తెకు హెచ్ఐవి సోకినట్లు తెలియాలి.

– పెళ్లి చేసుకోవాలనుకునే వ్యక్తి (అబ్బాయైనా, అమ్మాయైనా) తన ఆరోగ్యం, అవసరాలు తీర్చుకుంటూ/చూసుకుంటూ తనకు కాబోయే జీవిత భాగస్వామి అవసరాలను కూడా తీర్చగలిగే ఆర్థికస్తోమత కలిగి ఉండాలి.

–వ్యాధి సిడి 4-500 దశలో ఉండాలి.

–గుర్తింపు పొందిన వైద్యునితో ధృవీకరింపబడిన సిడి-4 రిపోర్టు, ఫోటో, నివాస ధృవీకరణ పత్రం, వ్యక్తిగత వివరాలు (బయోడేటా) విధిగా మ్యారేజ్ బ్యూరోకి సమర్పించాలి.

పైన చెప్పిన ఈ అర్హతలన్నీ ఉంటేనే మ్యారేజ్ బ్యూరోని సంప్రదించాలని ప్రసాద్ ఖచ్చితంగా చెబుతున్నారు.

ఏదైనా ఒక పనిని విజయవంతంగా పూర్తి చేయాలంటే దానికితగ్గ ఆర్థిక వనరుల్ని

ధైర్యంగా ముందుకెళ్తున్నా...

హెచ్ఐవి/ఎయిడ్స్ మ్యారేజ్ బ్యూరోను ప్రారంభించినప్పటి దగ్గరి నుండి ఇప్పటి వరకు ప్రసాద్ అనేక సవాళ్లను, సమస్యలను ఎదుర్కొన్నారు. అయితే తనకెదురైన ఆటంకాలను, అడ్డంకులను ధైర్యంగా ఎదుర్కొని హెచ్ఐవి పాజిటివ్ పెళ్లిళ్లను జరిపిస్తున్నాని, హాస్టల్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నాని ఆనందంతో చెబుతున్నారాయన.

"మొదట్లో నా మ్యారేజ్ బ్యూరో గురించి అందరూ ఎగతాళిగా మాట్లాడారు. నన్ను, నేను చేస్తున్న పనులను అసహ్యించుకున్నారు. ముఖ్యంగా సమాజంలోని చాలామంది నాకు కూడా ఎయిడ్స్ ఉండటం వల్లే ఈ విధమైన కార్యక్రమాలను చేపడుతున్నానని అపోహ పడుతుంటారు. నిజానికి మా ఇంట్లో హెచ్ఐవి వ్యాధిగ్రస్తులెవరూ లేరు. ప్రస్తుతం నాగోల్‌లో నిర్వహిస్తున్న 'హెచ్ఐవి పాజిటివ్ వర్కింగ్ మెన్ అండ్ ఉమెన్' హాస్టల్‌ను మొదట్లో సరూర్‌నగర్ హుడా కాంప్లెక్స్‌లోని నా సొంత ఫ్లాట్‌లో ప్రారంభించా. అయితే మా అపార్టుమెంట్‌లోని వారు, చుట్టుపక్కల వారు ఈ హాస్టల్‌ను ఇక్కడి నుండి తొలగించాలంటూ నానా గొడవ చేశారు. హాస్టల్లో చేరే వారి వల్ల తమకు, తమ పిల్లలకు హెచ్ఐవి సంక్రమిస్తుందనేది వారి వాదన. దీనిపై నేను మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశా. ఈ వ్యాజ్యం కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉంది. ఆ తర్వాత చుట్టుపక్కల వారితో గొడవలు భరించలేక హాస్టల్‌ను నాగోల్‌కు మార్చా. మ్యారేజ్‌బ్యూరోతోపాటు హాస్టల్‌ను నిర్వహించేందుకు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో నేను చేస్తున్న కార్యక్రమాలను వివరిస్తూ ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపిశాక్స్) ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించాను. ఆర్థికసాయం చేయాలని అర్థించాను. ఫలితం లేకపోయింది. దీంతో నాకు తెలిసిన స్నేహితులు, వైద్యులు, శ్రేయోభిలాషులు, రాజకీయ నాయకుల నుండి విరాళాలు సేకరించటం ద్వారా ఆర్థిక ఇబ్బందులను తొలగించుకోవాలని నిర్ణయించుకున్నా. వివిధ పార్టీలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలను కలిశా. నన్ను, నేను చేస్తున్న కార్యక్రమాలను సహృదయంతో అర్థం చేసుకున్న ఎంతోమంది ఇచ్చిన విరాళాలతో నా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించగలుగుతున్నా. మ్యారేజ్‌బ్యూరో, హాస్టల్ నిర్వహణలో నా భార్య సహకారం మరువలేనిది. మంచి మనసుతో నన్ను అర్థం చేసుకున్న ఆమె నాకు అన్ని విధాలా సహకరిస్తుంది కాబట్టే నేను ఈ విధమైన సేవలు చేయగలుగుతున్నా".

-శ్రీనివాస హనుమత్ ప్రసాద్,

9391183116.



సమకూర్చుకోవాలి. తన దగ్గర ఉన్న కొద్దిపాటి డబ్బుతో ప్రసాద్ మ్యారేజ్ బ్యూరోను ప్రారంభించారు. అయితే దాని నిర్వహణకు అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అందుకే వివాహ నిమిత్తం తన దగ్గరకు వచ్చే హెచ్ఐవి వ్యాధిగ్రస్థులకు వెయ్యి రూపాయల ఫీజు నిర్ణయించారు. ఫీజు రూపంలో వచ్చిన డబ్బును మ్యారేజ్ బ్యూరో నిర్వహణకు వినియోగిస్తున్నారు.

పోషకాహారాన్ని అందించే వసతిగృహం

మ్యారేజ్ బ్యూరోను నిర్వహించటం ద్వారానే తన పని పూర్తయిందనుకోలేదు ప్రసాద్. హైదరాబాద్ నగరంలో హెచ్ఐవి సోకిన వారెందరో ఉన్నారు. వీరిలో చాలామంది చిన్నస్థాయి నుండి పెద్దస్థాయి ఉద్యోగాల్లో ఏదో ఒకటి చేసుకుంటూ తమ కాళ్లమీద తాము నిలబడినవారూ ఉన్నారు. అయితే వీరంతా తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితుల నిరాదరణకు గురై మానసికంగా కృంగిపోతున్నారనే విషయం ప్రసాద్ దృష్టికి వచ్చింది. వీరికీ ఒక ఆశ్రయాన్ని కల్పించి బాసటగా నిలవాలనే ఆలోచన ఆయనకు వచ్చింది. తన ఆలోచనకు వెంటనే కార్యరూపమిచ్చారు. సరూర్‌నగర్ హుడా కాంప్లెక్స్‌లో తన సొంత ప్లాట్‌లోనే 'హెచ్ఐవి పాజిటివ్ వర్కింగ్ మెన్ అండ్ ఉమెన్' హాస్టల్‌ను ఏర్పాటు చేశారు. కొన్ని కారణాల వల్ల ఇప్పుడు ఆ హాస్టల్‌ను నాగోల్‌కు మార్చారు. హాస్టల్‌లో చేరాలనుకున్న వారు నెలకు రూ.3 వేలు చెల్లించాలి. హాస్టల్‌లో చేరిన వారికి మంచి వసతితోపాటు పౌష్టిక ఆహారాన్ని అందిస్తారు. ప్రతి రోజు పాలు, రాగిజావ, మొలకలు, గుడ్లు, కాచి చల్లార్చిన నీరు, సీజనల్ ఫ్రూట్స్, ఆకుకూరలతో కూడిన బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తున్నారు. ఈ హాస్టల్‌లో వంటవారు, వడ్డించేవారు, ఇతర పనిమనుషులు కూడా 'హెచ్ఐవి పాజిటివ్' వ్యక్తులే కావటం గమనార్హం. ఈ ముగ్గురు పనిమనుషులకు ఉచిత వసతితోపాటు నెలకు రూ.1500 వేతనమిస్తున్నారు.

కులం..ప్రాంతం...కట్నం...

శాస్త్ర సాంకేతికరంగాల్లో మనదేశం ఎంతో పురోగమిస్తున్నా కొన్ని ఆచారాలు, వ్యవహారాలు, కట్టుబాట్లు మనల్ని వదలటం లేదు. హెచ్ఐవి, ఎయిడ్స్ సోకి జీవితంలో నిరాశకు గురయిన వారు కూడా వీటిని పట్టుకుని వేలాడటం విస్మయాన్ని కలిగిస్తోందని ప్రసాద్ చెబుతున్నారు. వివాహం కోసం తన మ్యారేజ్ బ్యూరోను సంప్రదించే హెచ్ఐవి పాజిటివ్ వ్యక్తుల్లో (మగవారు) కొంతమంది...తమకు కూడా కట్నాలు, కానుకలు కావాలని అడుగుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోందని చెబుతున్నారు. మరికొంతమంది తమ కులం లేదా మతానికి చెందిన హెచ్ఐవి పాజిటివ్ అమ్మాయిని / అబ్బాయిని వెదికి పెట్టమని అడుగుతున్నారని వివరించారు. మరికొంతమంది ఒకడుగు ముందుకేసి తమకు తమ ప్రాంతానికే చెందిన అమ్మాయి/అబ్బాయి (ఆంధ్రా, రాయలసీమ, తెలంగాణ...ఇలా) కావాలని అడిగినప్పుడు వారిని చూసి తనకు జాలేస్తోందని చెబుతున్నారు. ఎందుకంటే అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉన్న

డిసెంబర్ ఒకటవ తారీకునే ఎందుకు?

ప్రపంచానికి ఎయిడ్స్ వ్యాధి పట్ల సరైన అవగాహన కలిగించి దాని పట్ల అపోహలను తొలగించేందుకు ఇద్దరు ప్రజా సమాచార అధికారులకు 'ప్రపంచ ఎయిడ్స్ దినం' ఆలోచన వచ్చింది. జేమ్స్ బన్న్, థామస్ నెట్టర్ అనే ఈ ఇద్దరు స్విట్జర్లాండ్‌లోని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఉద్యోగులు. ఆగస్ట్ 1987లో తమకు తట్టిన ఆలోచనను తమ సంచాలకుడైన జోనాథన్ మన్‌కి చెప్పి, ఆయన ఆమోదంతో డిసెంబర్ ఒకటి, 1988 నుండి ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని పాటించాలని అనుకున్నారు. ఈ కార్యక్రమానికి విస్తృత ప్రచారం దక్కాలంటే పశ్చిమ దేశాల మీడియా దృష్టిని ఆకర్షించడం ముఖ్యమని జోనాథన్ తలచాడు. కానీ 1988లో అమెరికాలో ఎన్నికలు. డిసెంబర్ నాటికి ఎన్నికలు ముగిసిపోతాయి. జర్నలిస్టులు ఎన్నికల వార్తలతో విసిగి, కొత్త వార్తల కోసం వెదుకుతుంటారు. అటు ఎన్నికల సందడిలోను, ఇటు క్రిస్మస్ వార్తలలోను కలిసి పోకుండా డిసెంబర్ ఒకటిన అయితే తమ కొత్త 'రోజు'కు ప్రపంచ వార్తలలో సముచిత స్థానం దక్కుతుందని జోనాథన్, బన్న్ ఆ రోజుని నిర్ణయించారు.

-యాజీవ్

జాగ్రత్తలతో జీవితం ఆనందమయం

హెచ్ఐవి పాజిటివ్ వ్యక్తులకు పెళ్లి చేయగానే పని అయిపోదు. భవిష్యత్తు జీవితం గురించి వారికి అనేక అనుమానాలు ఉంటాయి. వీటిపై కూడా ప్రసాద్ కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. ఇద్దరమూ (భార్యాభర్తలిరువురూ) పాజిటివ్ వ్యక్తులమే కాబట్టి శృంగారం విషయంలో ఎలా వ్యవహరించినా పర్వాలేదనుకుంటే అది పెను ప్రమాదానికి దారి తీస్తుందని ఆయన హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో తప్పకుండా తొడుగులు (కండోమ్స్) ధరించాల్సిందేనని చెబుతున్నారు. క్రమం తప్పకుండా మందులు వాడటం, పౌష్టికాహారాన్ని తీసుకోవటం ద్వారా జీవితకాలాన్ని వ్యాధిగ్రస్తులు ఎక్కువకాలం జీవించే అవకాశం ఉంది. ఒకవేళ వీరు పిల్లలను కనాలనుకుంటే....ప్రసవించిన 72 గంటలలోపే తల్లికి నెవిరపిన్ అనే మాత్రను ఇవ్వాల్సి ఉంటుంది. బిడ్డ పుట్టిన 72 గంటలలోపే నెవిరపిన్ అనే సిరప్‌ను ఇవ్వటం ద్వారా ఆ బిడ్డకు హెచ్ఐవి సోకకుండా 99 శాతం నివారించవచ్చు. ఈ నెవిరపిన్ మాత్రలు, సిరప్‌లు రాష్ట్రంలోని అన్ని ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్లు (ఐసిటిసిలు), ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రుల్లో లభ్యమవుతాయి.



శూన్యంలోంచి....ధైర్యంగా....

నా పేరు ప్రజ్వల (పేరు మార్చాం). విశాఖపట్నంలో బీటెక్ పూర్తి చేసిన తర్వాత బెంగుళూరులోని ఒక మల్టీనేషనల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం సంపాదించాను. అక్కడ మాతో పనిచేసే కొందరు అబ్బాయిలతో కలసి కొన్నాళ్లు ఒకే రూమ్‌లో (రూమ్‌మేట్స్‌గా) ఉన్నాను. కావాల్సిన డబ్బు చేతిలో ఉండటంతో సరదాలకు అంతేలేకుండా పోయింది. ఫలితంగా హెచ్ఐవి బారిన పడ్డాను. నాకు ఈ వ్యాధి సోకిందని తెల్సిన తర్వాత నరకయాతన అనుభవించాను. భవిష్యత్ అంతా శూన్యంగా కనిపిస్తున్న నాకు హైదరాబాద్‌లోని హెచ్ఐవి/ఎయిడ్స్ మ్యారేజ్ బ్యూరో గురించి తెలిసింది. నాలాగే వ్యాధిబారినపడి కుంగిపోయిన మరో వ్యక్తి బ్యూరో ద్వారా నా గురించి తెలుసుకుని నన్ను పెళ్లి చేసుకోవటానికి అంగీకరించారు. ఈ మధ్యనే మా పెళ్లి జరిగింది. ఒకరి కష్టసుఖాలు మరొకరు చెప్పుకుంటూ మేం ఇప్పుడు ధైర్యంగా జీవిస్తున్నాం.

ఆత్మహత్యాయత్నం విరమించుకొని... ఆత్మవిశ్వాసంతో...

నాపేరు స్వప్న (పేరు మార్చాం). మాది హైదరాబాద్. నా పేరులాగే జీవితం కూడా కలగా మారిపోతుందనుకున్న నాకు మ్యారేజ్‌బ్యూరో కొండంత అండనిచ్చింది. మంచి మనిషిని నాకు తోడుగా మార్చింది. తెలిసీ తెలియని వయసులో సినిమాల్లో చూపిస్తున్నదంతా నిజమేనని భావించి, తల్లిదండ్రుల మాట వినకుండా ఒక కారుడ్రైవర్‌ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాను. ఆ తర్వాత తెలిసింది అతనికి పెళ్లయ్యిందని, ఇద్దరు పిల్లలున్నారని. కొద్దికాలానికే మరొక భయంకరమైన నిజం తెల్సింది. నేను చేసుకున్న వ్యక్తి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుడని. ఆయన భార్య కూడా అదే కారణంతో చనిపోయిందని. నేను టెస్ట్ చేయించుకుంటే నాకు హెచ్ఐవి సోకిందని తెలిసి కుప్పకూలిపోయాను. కొద్ది రోజులకే నన్ను కట్టుకున్నవాడు పోయాడు. ఆత్మహత్యే శరణ్యమనుకున్న నాకు హెచ్ఐవి మ్యారేజ్‌బ్యూరో గురించి తెలిసింది. నాలాగే జీవితంలో కుంగిపోయిన వ్యక్తితో నాకు పెళ్లి జరిపించింది. ఇప్పుడు నేనెంతో ఆత్మవిశ్వాసంతో బతుకుతున్నా.

ఇక బతికినంత కాలం హేపీగా...

నాపేరు ప్రమోద్ (మార్చిన పేరు). బెంగుళూరులో సైంటిస్ట్‌గా పనిచేస్తున్న నేను అనేక చెడు అలవాట్లకు బానిసయ్యాను. ఉన్నత కుటుంబంలో, అదీ డబ్బున్న కుటుంబంలో పుట్టాను కాబట్టి, నేనొక శాస్త్రవేత్తననే అహంభావంతో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా విచ్చలవిడిగా ప్రవర్తించాను. ఫలితంగా హెచ్ఐవి నన్ను, నా జీవితాన్ని కబళించింది. నిరాశా నిస్పృహలతో మునిగిపోయిన నేను ప్రసాద్‌గారు నిర్వహిస్తున్న మ్యారేజ్ బ్యూరోను ఆశ్రయించటం ద్వారా ఒక తోడును వెదుక్కున్నాను. ఆమె సాంగత్యంలో బతికినంతకాలం హేపీగా, ధైర్యంగా జీవిస్తాననే నమ్మకం నాకుంది.

చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తంగా...

నాపేరు గౌతమ్(మార్చిన పేరు). కర్నూలులోని ఒక ఫెర్టిలైజర్ కంపెనీకి నేను యజమానిని. కంపెనీ పనుల మీద నేను చెన్నై, ముంబాయి, గోవా తదితర ప్రాంతాలకు వెళుతుంటాం. కంపెనీలకు లాభాలు వచ్చినప్పుడు ఈ విధంగా టూర్లకు వెళ్లి ఎంజాయ్ చేయటం నాకు అలవాటైంది. ఆ తర్వాతనే తెలిసింది ఈ ఎంజాయ్ ఎయిడ్స్‌గా మారిందని. నాకు వ్యాధి సోకిందని తెలిసిన క్షణంలో కాళ్ల కింద భూమి కుంగిపోయింది. తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు అందరూ చీదరించుకున్నారు. చనిపోదామనుకున్న నాకు కొందరు శ్రేయోభిలాషులు మ్యారేజ్‌బ్యూరో గురించి చెప్పారు. నాలాగే వ్యాధిబారిన పడిన అమ్మాయికి తోడుగా మారటం ద్వారా నేను చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తం లభిస్తుందని భావించా. పెళ్లి చేసుకున్న తర్వాత తెలిసింది చనిపోవాలనుకున్న నా నిర్ణయం కరెక్టు కాదని.

వ్యక్తి ఈ వివరాలన్నీ అడగటం వేరే విషయం. కానీ భయంకరమైన వ్యాధి బారినపడి క్షణ క్షణం చస్తూ బతికే హెచ్ఐవి వ్యాధిగ్రస్తులు కూడా కట్నాలు, కానుకలు, కులగోత్రాలు, ప్రాంతాల గురించి అడగటం విడ్డూరంకాక మరేమిటి? అసలు ఒక హెచ్ఐవి పాజిటివ్ వ్యక్తికి పెళ్లి చేయటానికి మరో హెచ్ఐవి పాజిటివ్ వ్యక్తి దొరకటమే కష్టం కదా? అయితే ఇలాంటి వారందరినీ కూర్చోబెట్టి ఓపిగ్గా వారందరికీ కౌన్సిలింగ్ నిర్వహించటం ద్వారా వారిలోని అపోహల్ని, అనుమానాల్ని పటాపంచలు చేస్తున్నారు ప్రసాద్. అయితే ఎంతో సహనంతో ఈ కౌన్సిలింగ్ నిర్వహించాల్సి ఉంటుందని, ఎదుటి వ్యక్తి అడిగే అనేక ప్రశ్నలకు ఓపికతో సమాధానం చెప్పాల్సి ఉంటుందని ఆయన వివరిస్తున్నారు. అన్ని విషయాల్లో వారందరినీ ఈ విధంగా ఒప్పించిన తర్వాతే వివాహాలు జరిపిస్తున్నారు.

సంచార ప్రచార వాహనం

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన, హెచ్ఐవి మ్యారేజ్‌బ్యూరో, హాస్టల్ అవి అందిస్తున్న సేవలను రాష్ట్రంలోని మారుమూల గ్రామాల్లోని ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో డిసెంబరు 1 నుండి ఒక సంచార ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్నానని ప్రసాద్ చెప్పారు. ఈ వాహనం ద్వారా అన్ని జిల్లాల్లోని గ్రామాలు, మండలాల్లో పర్యటించి అక్కడి ప్రజలు, గ్రామ పెద్దలు, రాజకీయ నేతల్ని కలిసి తన సేవలపై ప్రచారం నిర్వహించాలని ఆయన యోచిస్తున్నారు. దీంతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, పట్టణారోగ్య కేంద్రాల వైద్యుల దగ్గరకు వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహిస్తానన్నారు.

(డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా)

కథ

చిగురులు వేసిన కలలన్నీ...

- కూచిభట్ల శ్రీనివాస శాస్త్రి

"ఇక్కడ టులెట్ బోర్డు వుంది, తమ్ముడూ. ఈ ఇంట్లో అద్దెకిచ్చే వాటా చూద్దాం" అని సరళ గోపాల్‌తో అన్నమాటలు విని రాధిక గదిలో నుంచి వచ్చింది. కాంపౌండ్ గేట్‌తీసి సరళ, గోపాల్ లోపలికి వచ్చారు.

"అద్దెకిచ్చే వాటా చూపిస్తారండీ?" గోపాల్ అడిగాడు. వాళ్ళతో ఒక మూడేళ్ళపిల్లవాడు కూడా వున్నాడు. రాధిక సమాధానం చెప్పే లోపల ఆపిల్లవాడు గబగబా పరుగెత్తుకుంటూ ఆమె దగ్గరకు నవ్వుతూ వెళ్ళాడు. చూడటానికి చాలా ముద్దుగా, బొద్దుగా వున్నాడు. ఆమె వెంటనే సంతోషంగా వాడిని చేతుల్లోకి తీసుకుని, ముద్దు పెట్టుకుని, ఎత్తుకుని సరళని

"మీ బాబేనాండి?" అని అడిగింది.

"కాదండి. నా తమ్ముడి బాబు" అని గోపాల్‌ని చూపించింది. సరళ రాధిక అసలు విషయానికి వచ్చి అద్దెకిచ్చే వాటాను వాళ్ళకి చూపించింది.

"బాగుందండి. అద్దెంతండి?" గోపాల్ అడిగాడు.

"నెలకు రెండువేల రూపాయలు. సపరేట్ సబ్ మీటరులో రీడింగ్ ప్రకారం కరెంట్‌కు డబ్బు కట్టాలి"

"ఎన్ని నెలల అడ్వాన్స్ ఇమ్మంటారు?"

"అడ్వాన్స్ అవసరం లేదు. నెల అయిన తరువాత అద్దె ఇవ్వండి "

ఈ సంభాషణ జరగుతున్నంత సేపు రాధిక ఆ బాబుని ఎత్తుకునే వుంది.

"నీ పేరేంటి, బాబూ?" రాధిక అడిగింది.

"లామకిత్తన" అని ముద్దు ముద్దుగా వచ్చి రాని మాటలతో నవ్వుతూ చెప్పాడు.

"రామకృష్ణండి" అన్నాడు గోపాల్ కూడా నవ్వుతూ.

"బాబు చాలాస్మార్ట్‌గా వున్నాడు. అని మళ్ళీ వాడిని ముద్దు పెట్టుకుని సరళ కందించింది రాధిక.

"ఈ బాబు తల్లి?" రాధిక అడిగింది.

"ఆర్నెల్ల కిందట ఈ లోకాన్ని విడిచి వెళ్ళింది" సరళ అంది. గోపాల్ మౌనంగా వున్నాడు.

"మరి ఈ పిల్లాడిని ఎవరు పెంచుతారు? వాడు తల్లి పోయినప్పటి నుంచి తండ్రి దగ్గరే అలవాటు పడ్డాడు"

"అయితే పిల్లవాడికి సమస్యలేదన్న మాట. అన్నట్టు మీరు ఈ ఇంట్లో ఎప్పుడు చేర్తారు?"

"మంచి రోజు చూసుకుని నా తమ్ముడు బాబుతో వస్తాడు."

"అయితే ఇక్కడ వుండేది తండ్రీకొడుకులే నన్నమాట"

"అవునండి వెళ్ళొస్తామండి" అంది సరళ. గోపాల్ కూడా అదే మాట చెప్పి వెళ్ళిపోయారు.

రాధిక ఆలోచనలోకి వెళ్ళింది. దంపతుల కెవరికైనా అద్దెకిద్దామని ముందు అనుకుంది కాని కొంచెం పరిచయంతోనే తన మనసును రామకృష్ణ వాడివైపు లాక్కున్నాడు. వాడు తన కళ్ళఎదుట ఎప్పుడూ వుంటే బాగుంటుందని ఆశపడి ఆ తండ్రీ కొడుకులకు తన ఇల్లు అద్దె కివ్వటంలో తప్పు లేదని మనసును సమాధాన పరచుకుంది.

ఓ రోజు గోపాల్, సరళ రామకృష్ణతో వచ్చి పాలు పొంగించారు. రామకృష్ణ మళ్ళీ రాధిక చంకలోకి ఎక్కాడు. పాలు పొంగినట్టుగా ఆమె మనసు కూడా ఆనందంతో ఉప్పొంగింది. ఒక్కరోజులో గోపాల్, సరళ సామాన్లను ఇంట్లోకి చేరవేశారు.

సరళ రాధికతో, "రేపు ఉదయం నా ఇంటికి వెళ్తున్నాను. నా తమ్ముడి ఒక అద్దె ఇల్లు కుదిరేటంత వరకు ఇక్కడ వున్నాను. వాడు క్లాత్ బిజినెస్ చేస్తూ వుంటాడు పెళ్ళాంపోయిన తరువాత ఆ బిజినెస్‌కు ఒక నమ్మకస్థుడైన అసిస్టెంట్‌కు అప్పగించి తనుపిల్లవాడిని చూసుకుంటున్నాడు" అంది. కొద్దిపాటి పరిచయంతోనే రాధిక సరళ ఒకరికొకరు ఆత్మీయులుగా అయి అరమరికలు లేకుండా వాళ్ల స్వంత విషయాలు, కుటుంబ విషయాల గురించి మాట్లాడుకున్నారు.

"మీ మరదలు ఎలా చనిపోయింది?" రాధిక అడిగింది.

"రామకృష్ణుడికి రెండున్నర సంవత్సరాల వయసులో ఆమె ఒకరాత్రి హఠాత్తుగా గుండె జబ్బుతో మరణించింది"

"అయ్యోపాపం" అంది రాధిక విచారంగా.

"పిల్లవాడి ఆలనాపాలనా చూడటానికి తమ్ముడికి ఇరవై అయిదేళ్లయినా దాట లేదు. వాడికి కూడా జీవితంలో ఒక తోడువుండాలి కదా! మంచి సంబంధం కుదిర్తే మళ్లీ పెళ్లి చేసుకుని ఆ తరువాత బిజినెస్ చూసుకుంటానన్నాడు."

"అతని ఉద్దేశ్యం సరైనదే" అంది రాధిక.

"ఈ కొద్ది రోజుల మన పరిచయంలో మీరేమీ అనుకోనంటే మిమ్మల్ని ఒక విషయం అడుగుదామని వుంది.

"ఫరవాలేదు అడగండి" అంది రాధిక.

రాధిక నుదుటి మీద బొట్టు లేకపోవటంతో సరళ "మీ శ్రీవారిగురించి..." అని సందేహంగా అంది.

"ఏం చెప్పమంటారు? చీకు, చింత లేకుండా హాయిగా సాగిపోతున్న మా కాపురం ముక్కలైంది. ఒక రోజు మార్కెట్ నుంచి తిరిగి వస్తున్న మా వారిని లారీ ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే తుది శ్వాస విడిచారు. మాది ప్రేమ వివాహం కావడం చేత అటు పుట్టింటికి ఇటు అత్తింటికి దూరమై ఒంటరి దాన్నయ్యాను"

"పిల్లలు లేరా?"

" సంతానం కలుగుతుందని ఆ మూడు సంవత్సరాలు ఎదురు చూశాం కాని నిరాశే మిగిలింది"

"ఇప్పుడు మీ వయసు?"

"ఇరవై ఒకటి"

"ఇంత చిన్నవయసులో మీకు ఒంటరి

జీవితమా? మీ భర్తతో ముప్పై సంవత్సరాలు చేయాల్సిన కాపురం మూడేళ్ళకే పరిమితమైందని వింటే నాకు చాలా బాధ కలుగుతోంది. మీరు మళ్ళీ తగిన వ్యక్తిని ఎందుకు పెళ్లి చేసుకోకూడదు?"

"భర్త చనిపోయిన ఆడది మళ్ళీ పెళ్లి చేసుకుంటే సమాజం ఒప్పుకుంటుందా?"

"మీ ఆలోచనలింకా పాత కాలంలోనే వున్నాయి. కొంత మంది సంఘ సంస్కర్తలు వితంతు వివాహాలను ప్రోత్సహించారని మీకు తెలియదా? భార్యలు పోయిన ఎంతమంది మగవాళ్లు మళ్ళీ వివాహం చేసుకోవడంలేదు? లేని పోని అనుమానాలతో, భయాలతో ఒంటరిగానే జీవి తం గడిపేస్తారా? మీరు మళ్ళీ పెళ్ళి చేసుకుంటే మీకు సంతానం కలుగవచ్చు" అని ప్రోత్సాహంగా మాట్లాడింది సరళ.

మళ్లీ పెళ్ళి చేసుకుంటే తనకు సంతానం కలుగుతుందనే ఆశతో ఆమె సరళతో, "భర్తను పోగొట్టుకున్న నన్ను పెళ్ళి చేసుకోవడానికి ఏ మగాడైనా ముందుకు వస్తాడా?" సందేహం వెలిబుచ్చింది రాధికతో సరళ.

"ముందు మీరు రెండవ పెళ్లికి అనుకూలంగా నిర్ణయం తీసుకోండి" అంది.

"అలాగేనండి, అన్నట్టు మీ వారి గురించి, పిల్లల గురించి చెబుతారా?"

"మా ఆయన బ్యాంక్‌లో పని చేస్తున్నారు. మాకు పదిహేనేళ్ల అమ్మాయి వుంది. టెన్త్ క్లాస్ చదువుతోంది. ఇంటి పనుల్లో, వంట పనుల్లో నాకు సహాయం కూడా చేస్తుంది. నేనింట్లో లేనప్పుడు ఆయనకి వంటచేసి పెడ్తుంది."

"మీ కుంటుంబం గురించి వినడానికి ముచ్చటగా వుంది. ఒకసారి మీ వారిని, అమ్మాయిని కూడా తీసుకురండి" అంది రాధిక సంతోషంగా.

సరళ లేచి వేళ్తూ "సమయం వచ్చినప్పుడు తప్పకుండా తీసుకు వస్తానండి వెళ్లొస్తానండి" అంది. ఆ రాత్రి సరళ తన తమ్ముడికి రాధిక కుటుంబం గురించిన వివరాలన్నీ చెప్పింది.

రోజులు, నెలలు గడుస్తున్నాయి. రాధిక తన ఇంటి పనులు పూర్తి చేసుకున్న తరువాత తీరిక సమయాల్లో రామకృష్ణతో కాలక్షేపం చేస్తోంది. ఇప్పుడామెకు ఒంటరితనం బాధ తప్పింది తను రామకృష్ణలాంటి కొడుకును కనాలంటే మళ్లీ పెళ్ళి చేసుకోవాలి. ఆమెకు సరళ చెప్పిన సలహా గుర్తుకు వచ్చింది. కాని తనను ఎవరు పెళ్లి చేసుకుంటారు? పెళ్లి చేసుకున్న రెండవ భర్త తనని మొదటి భర్తలా ప్రేమిస్తాడా? ఈ ప్రశ్నలు ఆమెకు ఎదురైనాయి. అప్రయత్నంగా ఆమె లోచనలు గోపాల్‌వైపు మళ్లాయి. ఆమెకి అతని ప్రవర్తనలో ఎటువంటి లోపం కనపడలేదు. తనతో అసభ్యంగా మాట్లాడలేదు. చెడుగా ప్రవర్తించలేదు. అతను తన హద్దులతో వుండి తన సంస్కారాన్ని నిరూపించుకుంటున్నాడు. అతనితో తనకు వివాహమైతే తనకు సంతానం కలగకపోయినా రామకృష్ణ చేత అమ్మ అని పిలిపించుకోవచ్చు. ఆమె ఆశావాదానికి అడ్డుకట్ట వేస్తూ ఆమెని రెండు ప్రశ్నలు వేధించసాగాయి. భర్తను పోగొట్టుకున్న తనని పెళ్ళి చేసుకోవడానికి అతను ఇష్టపడతాడా? కన్నెపిల్లనే పెళ్ళి చేసుకుందామని అనుకోడా? రాధిక గురించిన వివరాలను సరళ తనకు చెప్పినప్పటి నుంచి గోపాల్ మనసులో అమెను గురించి ఆలోచనలు మెదుల్తున్నాయి. ఆమె మళ్లీ పెళ్లి చేసుకోవడానికి అంగీకరించినా, భార్యను పోగొట్టుకున్న తనని పెళ్లి చేసుకోవడానికి ఇష్టపడుతుందా? ఆమె అందగత్తె. ఆమె కోరితే మొదటి పెళ్ళి మగవాడు ఎవరైనా ఆమె మెడలో తాళికడతాడు. ఈ ఆలోచనలు అతనిని కలవర పెడుతున్నాయి.

రోజులు, నెలలు గడుస్తున్నాయి. రాధిక తన ఇంటి పనులు పూర్తి చేసుకున్న తరువాత తీరిక సమయాల్లో రామకృష్ణతో కాలక్షేపం చేస్తోంది. ఇప్పుడామెకు ఒంటరితనం బాధ తప్పింది తను రామకృష్ణలాంటి కొడుకును కనాలంటే మళ్ళీ పెళ్ళి చేసుకోవాలి. ఆమెకు సరళ చెప్పిన సలహా గుర్తుకు వచ్చింది. కాని తనను ఎవరు పెళ్లి చేసుకుంటారు? పెళ్లి చేసుకున్న రెండవ భర్త తనని మొదటి భర్తలా ప్రేమిస్తాడా? ఈ ప్రశ్నలు ఆమెకు ఎదురైనాయి. అప్రయత్నంగా ఆమె లోచనలు గోపాల్‌వైపు మళ్లాయి. ఆమెకి అతని ప్రవర్తనలో ఎటువంటి లోపం కనపడలేదు. తనతో అసభ్యంగా మాట్లాడలేదు. చెడుగా ప్రవర్తించలేదు. అతను తన హద్దులతో వుండి తన సంస్కారాన్ని నిరూపించుకుంటున్నాడు. అతనితో తనకు వివాహమైతే తనకు సంతానం కలగకపోయినా రామకృష్ణ చేత అమ్మ అని పిలిపించుకోవచ్చు. ఆమె ఆశావాదానికి అడ్డుకట్ట వేస్తూ ఆమెని రెండు ప్రశ్నలు వేధించసాగాయి. భర్తను పోగొట్టుకున్న తనని పెళ్ళి చేసుకోవడానికి అతను ఇష్టపడతాడా?

కాలం గడుస్తోంది. రామకృష్ణ రాధికకు చాలా దగ్గరయ్యాడు. ఆమెవాడిని తల్లి లాగా చూసుకుంటోంది.

అది వసంత ఋతువు. ఆరోజు చైత్రపౌర్ణమి సుమారుగా రాత్రి పదిగంటలకు పవర్‌కట్ అయింది. సీలింగ్ ఫ్యాన్ ఆగి పోవడంతో ఉయ్యాలలో పడుకున్న రామకృష్ణ గాలి ఆడక చికాకు పడుతూ నిద్రలేచి ఏడవటం మొదలు పెట్టాడు. ఆ ఏడుపు రాను రాను ఎక్కువ అవుతోంది. గోపాల్ విసిన కర్రతో విసిరినా వాడు ఏడుపు మానంటం లేదు. వాడి ఏడుపు మొదటి నుంచి రాధిక చెవిలో పడుతూనే వుంది. చివరికి ఆమె వుండ బట్టలేక గోపాల్ వున్న అద్దెవాటాలోకి వెళ్ళింది. ఆ సమయంలో ఆమె రాకకు అతను ఆశ్చర్యపడినా. "బాబు ఎంతసేపటికి ఏడుపు మానటం లేదండీ..." అన్నాడు.

రాధిక "బాబు సంగతి నేను చూసుకుంటానండి" అని వాడిని ఉయ్యాలలో నుంచి తీసి ఎత్తుకుని కిటికీ దగ్గరకు వెళ్లి నిలబడింది. ఆమె శ్రావ్యంగా పాటలు పాడగలదు. కంఠం సవరించుకుని "జో అచ్చుతానంద జోజో ముకుందా" అని జోలపాట అందుకుంది. అప్పుడే కిటికీలో నుంచి లోపలికి వీస్తున్న చల్లని గాలికి నిద్రలోకి జారుకున్నాడు. రాధిక వాడిని ఉయ్యాల్లో పడుకోబెట్టింది. కాని ఆమెకి అక్కడ నుంచి కదల బుద్ధి కాలేదు.

ఆమె కిటికీ దగ్గర నిలబడి బయటికి చూసింది. నిండు చంద్రుడు, తళతళా మెరుస్తున్న పున్నమి వెన్నెల చుట్టూవున్న కాంపౌండ్‌లో పూల చెట్ల నుంచి వస్తున్న మల్లె జాజి పూల సువాసనలు, వేపచిగుళ్ళు తిన్న కోయిల శ్రావ్యమైన కూకూ ధ్వనులు ఆమెని కట్టి వేశాయి.

ఇంతలో గోపాల్ వచ్చి తన ధైర్యాన్నంతటిని కూడగట్టుకుని "మీరు నన్ను పెళ్లి చేసుకొంటారా?' అనడిగాడు.

కొన్ని క్షణాలు ఆమె సంభ్రమాశ్చర్యాలతో నిశ్చేష్టురాలైంది. "మీ గురించి నాకు అక్క అంతా చెప్పింది. మీరే నా బాబుకు తల్లి లేనిలోటును తీర్చగలరని నాకు పూర్తి నమ్మకం వుంది. ఇప్పుడు మీరు దానిని ఋజువు చేశారు. మీకు అభ్యంతరం లేకపోతే మిమ్మల్ని పెళ్లి చేసుకుంటాను. మీ అభిప్రాయం చెప్పండి. అన్నాడు గోపాల్.

ఆమె సిగ్గుపడుతూ "నాకు అభ్యంతరం లేదు. ఇది నా అదృష్టం" అని తన ఇంట్లోకి వెళ్లి పోయింది.

సరళ దంపతుల సమక్షంలో గోపాల్ రాధికల వివాహం క్లుప్తంగా నిరాడంబరంగా జరిగింది. సంవత్సరం గడిచేలోపల రాధిక ఒక మగపిల్లవాడిని కన్నది. వాడు రామకృష్ణ పోలికలతో వున్నాడు. ఆమె కలలు నిజమైనాయి. చంటి వాడిని ముద్దాడుతూ చిగురులు వేసిన కలలన్నీ సిగ్గులో పూలుగ మారినవి అని సంతోషంతో పూల రంగడు సినిమాలో పాటను తృప్తిగా పాడింది. ★

తెలుసుకుందామా...

సుగంధ ద్రవ్యాలు... నౌకాయానాలు...

ఇప్పుడంటే ఎక్కడ ఏ దేశముందో, ఎటునుంచి ఎలా అక్కడకు చేరవచ్చో తెలుసు కాబట్టి విమానమో, ఓడో ఎక్కేసి వెళ్లిపోతాం. మరి అవేమీ తెలీని రోజుల సంగతో! కొత్త ప్రాంతాలను కనుగొనడానికి, తెలిసిన ప్రాంతాలకే కొత్తదారులను అన్వేషించడానికి ఎందరు సాహసికులు బయలుదేరేవారో లెక్కేలేదు. అయితే ఆ యాత్రల ప్రధాన లక్ష్యం వాణిజ్యమే. ఆ వాణిజ్యం ప్రధానంగా సుగంధ ద్రవ్యాల రవాణాయే. ఇప్పుడు ఆలోచిస్తే ఆశ్చర్యం కలిగించ వచ్చునేమో కానీ ఆ రోజుల్లో తూర్పు దేశాలలో పండే మసాలా దినుసులకు పశ్చిమ దేశాలలో ఉన్న గిరాకీ అలాంటిది. వలస పాలనకు దారితీసింది కూడా ఈ వాణిజ్యమే. మరి ఆ వివరాలేంటో తెలుసుకుందామా!



సుగంధ ద్రవ్యాలు రకరకాలు. వంటల్లో వాడే మసాలా దినుసులు, సువాసనకు ఉపయోగించేవి. పూజాపునస్కారాలలో ఉపయోగించేవి. అల్లం, సాంబ్రాణీ, కస్తూరి, దాల్చినచెక్క, లవంగాల వంటి సుగంధ ద్రవ్యాల వ్యాపారం మొదట్లో ఎక్కువగా జరిగింది. చైనా, మధ్య ఆసియా ఇండియా, రష్యా ఇరాన్, ఇండోనేషియా, శ్రీలంక, ఈజిప్ట్, ఆఫ్రికా దేశాలకు రాకపోకలు బాగా సాగేవి. ఆ రోజుల్లో కొత్త ప్రపంచంగా పిలిచిన అమెరికా ఖండాలను కనిపెట్టడం కొత్త వాణిజ్యానికి దారులు తెరచింది. మెక్సికో, బ్రెజిల్, ఈక్వెడార్, పెరు వంటి దేశాలలో పండే సుగంధ ద్రవ్యాలు ప్రపంచానికి పరిచయం అయ్యాయి. సుగంధ ద్రవ్యాల వేట, ఆ వాణిజ్యం తెచ్చిపెట్టే లాభాలు మనిషిలోని మానవుణ్ణి మాయం చేసిన సందర్భాలు కూడా చాలా ఉన్నాయి. అరేబియాలో దొరికే సుగంధ ద్రవ్యాల కోసం ఆస్సీరియన్లు అడ్డం వచ్చిన అందరినీ సంహరించారు. యూరప్ వాణిజ్యంపై పట్టుకోసం జెనీవా, వెనిస్ నగరాల ప్రజల మధ్య చాలా కాలం ఘర్షణలు జరిగాయి. ఇంగ్లీషువారు మొట్టమొదట ఆక్రమించుకున్న ఇండోనేషియా దీవి 'కన్'ను ఆ తర్వాత డచ్చివారు సర్వనాశనం చేశారు. ఇదంతా కూడా సుగంధ ద్రవ్యాల కోసమే.

గొప్ప గొప్ప అన్వేషకుల పుణ్యమా అని పశ్చిమ దేశాల ప్రజలకు సుగంధ ద్రవ్యాల కొరత ఏనాడూ రాలేదు. బంగారం, బంగారం లాంటి సుగంధ ద్రవ్యాల సీమ అయిన ఇండియాకు సముద్రమార్గం కనిపెట్టేందుకు 1492లో క్రిస్టఫర్ కొలంబస్ నౌకాయానం మొదలైంది. అయితే అతను చివరికి దక్షిణ అమెరికా ఖండ తీరాన్ని చేరాడు. 1498లో వాస్కోడిగామా ఈ ప్రయత్నంలో విజయం సాధించాడు. ఫలితంగా రత్నగర్భ అయిన భారతదేశపు సంపదలు పశ్చిమ దేశాలకు తరలివెళ్ళేందుకు మార్గం సుగమమయింది. ఈ ఇద్దరు నావికుల శ్రమ ఫలితంగా స్పెయిన్, పోర్చుగల్ కొద్ది కాలం పాటు సుగంధ ద్రవ్యాల వాణిజ్యంపై ఆధిపత్యం సంపాదించాయి. 15వ శతాబ్దం నాటి ఈ ఇద్దరి నౌకాయానాలే సుగంధ ద్రవ్యాల వాణిజ్యానికి నాంది పలికాయనుకోవడం మాత్రం పొరబాటే. సుగంధ ద్రవ్యాల కథలో వారిద్దరూ చివరి అధ్యాయం ప్రారంభించారు. అంతకు ముందు రెండు అధ్యాయాలు నడిచాయి. హిందూ మహాసముద్రం ద్వారా 2600 సంవత్సరాల క్రితం నుంచీ వర్తక వ్యాపారాలు సాగాయి. సుమారు 2100 సంవత్సరాల క్రితం ప్రాంరంభమైన

సిల్క్‌రోడ్ అప్పటి నుంచీ చైనాకు, యూరప్‌కు సుగంధ ద్రవ్యాలను అందిస్తూనే ఉంది. ఇండోనేషియాలో పండే సుగంధ ద్రవ్యాలు కనీసం 1800 సంవత్సరాల కిందటే పయనం చేశాయి.

ఝూంగ్ కియాన్ అనే అలుపెరుగని ఓ యోధుడు సిల్క్‌రోడ్ అనే బాటలో మొదటిసారిగా క్రీ.పూ.139 ప్రాంతంలో కియాన్ వాయువ్యదిశగా నివసిస్తున్న ప్రాంతం చేరుకోవడం అతని లక్ష్యం. 'హన్ల'కు వ్యతిరేకంగా అక్కడివారిని కూడగట్టడం కోసం ఈ యాత్ర మొదలైంది. 480 కి.మీ. పొడవు గోబీ ఎడారి దాటడం ఈ యాత్రలో కష్టమైన భాగం. మరో చైనా యాత్రికుడు జువాన్ జంగ్ కొంత కాలం తర్వాత గోబి ఎడారిలో ప్రయాణం గురించి రాశాడు. 'ఆకాశంలో పక్షులుగానీ, నేలపై జంతువులుగానీ కనబడవు. ఎక్కడా చుక్క నీరు ఉండదు. పొరపాటున కాస్త గడ్డి మొలవదు. తెల్లవారితే మళ్ళీ కనుచూపు మేర అదే ఇసుక. ఝూంగ్ కియాన్ దురదృష్టశాత్తు హన్లకు పట్టుబడ్డాడు. కియాన్‌ను ఏళ్ల తరబడి గృహ నిర్బంధంలో ఉంచిన హన్లు అతనికి ఒక భార్యను కూడా ఇచ్చారు. ఆ ఇద్దరికీ ఒక కొడుకు పుట్టాడు. 10 ఏళ్ల తర్వాత కియాన్ తప్పించుకుని తన ప్రయాణం కొనసాగించాడు. చివరికి సమర్‌ఖండ్ చేరాడు. ఆ గొప్ప నగరాన్ని సందర్శించిన మొట్టమొదటి చైనీయుడు అతనే. ఒక సంవత్సరం పాటు అక్కడే ఉండి పశ్చిమాసియా వాణిజ్యం గురిం,చి జాగ్రత్తగా వివరాలు సేకరించి ఝూంగ్ కియాన్ తిరుగు ప్రయాణం కట్టాడు. దురదృష్టం మళ్ళీ వెంటాడింది. మళ్ళీ హన్లకు పట్టుబడ్డాడు. క్రీ.పూ. 126లో హన్ల దేశం రాజకీయంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో కియాన్ మళ్ళీ తప్పించుకొని స్వదేశం చేరాడు.

ఝూంగ్ కియాన్ చేసిన యాత్ర ప్రపంచ చరిత్రలోనే ఒక గొప్ప మలుపు. కొద్ది సంవత్సరాలలోనే చైనా వ్యాపారులు, యాత్రికులు గోబి ఎడారిని దాటి మధ్య ఆసియాకు, ఇండియాకు రాకపోకలు ప్రారంభించారు. మరోవైపు మధ్యధరా ప్రాంతపు సరుకులతో పర్షియన్లు, సిరియన్లు కూడా రాకపోకలు మొదలుపెట్టారు. సిల్క్‌రోడ్డు వెంబడి మజిలీల వివరాలు మనకు రోమన్ల రాతల్లో కనబడతాయి.

సిల్క్ రోడ్డు వెంట ప్రయాణం ప్రమాదాలతో కూడినదే కాదు. చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కూడా. నెలల తరబడి ఒంటెలపై ప్రయాణం చేయాల్సి వచ్చేది. ఆ ఒంటెలపై వచ్చే సరుకుల విలువ భారీగా ఉంటే తప్ప గిట్టుబాటు కాదు. అతి మధురం (లికోరాస్) అనే పేరు, రేవల్చిన్ని (రుబార్బ్) అనే మూలిక, జిన్సెంగ్‌లకు బాగా గిరాకీ ఉండేది. సువాసన ద్రవ్యాల్లో అతి విలువైన కస్తూరి కూడా ఆ దశలోనే ప్రపంచ మార్కెట్‌లో ప్రవేశించింది. క్రీ.శ.400 ప్రాంతంలో సెయింట్ జెరోమ్ లాటిన్ భాషలో రాతల్లో కస్తూరి ప్రస్తావన మొదటిసారి కనబడుతుంది.

హిందూ మహాసముద్రాన్ని అధిగమించి సుగంధ ద్రవ్యాలను రవాణా చేయడం క్రీ.పూ. ఆరవ శతాబ్దంలోనే మొదలయిందని చెప్పవచ్చు. క్రీ.శ.200 నాటికి తూర్పు ఇండోనేషియా రేవులద్వారా లవంగాలు, జాజికాయ, దాల్చినచెక్క, యాలకులు, మిరియాలు, పసుపు, సాంబ్రాణి, గోపరసం, చలువ మిరియాలు, ముసాంబరం, గంధపు చెక్క వంటి తూర్పు అద్భుతాలు ప్రపంచానికి పరిచయం అయ్యాయి. దాల్చిన చెక్కకు ఆ రోజుల్లోనే రోమ్‌లో విపరీతమైన ధర పలికేది. అంత ధర ఎందుకు పలుకుతుందో వివరిస్తూ లాటిన్ రచయిత ప్లినీ ఇలా రాసాడు. "దాల్చిన చెక్క, కొనుగోలు చేసిన నావికులు పడవల్లో ఆ సరకు రవాణా చేయాలి. ఆ పడవలకు చుక్కాని ఉండదు. తెడ్లు వుండవు. తెరచాపలు అసలే వుండవు. మనుషులు వారి ధైర్యసాహసమే ఆ పడవలను నడిపిస్తాయి. శీతాకాలంలో వారు సముద్ర ప్రయాణం కడతారు. తూర్పు గాలులు ఆ సమయంలో బలంగా వీస్తుంటాయి. ఆ గాలులే పడవలను ముందుకు తోస్తాయి. ఈ వర్తకులకు రానూ పోనూ ఒక ప్రయాణానికి అయిదేళ్లు పడుతుంది.మధ్యలో చాలా మంది ప్రాణాలు కోల్పోయేవారు."

తర్వాతి కాలంలో పర్షియన్ నావికుడు బుజర్గ్ కూడా ఈ ప్రయాణం ఎంత ప్రమాదభరితమయిందో రాశాడు. నావికులందరితో పాటు హఠాత్తుగా సముద్రంలో నావ మునిగిపోవడం, నౌక మునగకుండా చూడడానికి విలువైన సరుకును సముద్రంపాలు చేయడం వంటి సంఘటనలు గురించి అతను రాశాడు. అతి కష్టం మీద ప్రాణాలు నిలుపుకున్న నావికుడు ఒకడు నిర్జన ద్వీపంలో సంవత్సరాల తరబడి మరో నౌక కోసం ఎదురు చూస్తూ కాలం గడపడం గురించి కూడా బుజర్గ్ రాశాడు. సింద్‌బాద్ సాహసయాత్రల రచనకు ఇవన్నీ ప్రేరణ అయి ఉండవచ్చు. ఎన్ని నౌకాప్రమాదాలు జరిగినా నౌకాయానాలు ఆగలేదు. అందులో ఉన్న లాభాలు అలాంటివి.

మధ్య యుగాల్లో అరబ్బులు ఈ వ్యాపారం బాగా చేశారు. జెరీనా, వెనిస్ నగరవాసులు యూరప్ అంతటా సుగంధ ద్రవ్యాలు అమ్ముతూ తమ ఇష్టం వచ్చినంత ధర డిమాండ్ చేసేవారు. స్పానిష్ నావికులు పోర్చుగీసువారు రంగంలోకి దిగింది అది చూసే.

1498లో కాలికట్ తీరంలో ఇండియాపై కాలుమోపిన వాస్కోడిగామా కారు చౌక ధరలకు దాల్చినచెక్క, జాజికాయ, లవంగాలు, మిరియాలు కొనుగోలు చేసి ఓడ నిండా నింపుకుని స్వదేశం వెళ్ళాడు. అప్పటి నుంచీ ఇక యూరప్ దేశాల మధ్య ఈ వాణిజ్యంపై ఆధిపత్యం కోసం పోరాటం ప్రారంభమైంది. 1517లో పోర్చుగీసువారు కోటలో పాగావేశారు. మలక్కా దీవులు అంతకు ముందే వారి వశం అయ్యాయి. ఈ రెండు చోట్లా తర్వాత డచ్చివారు కాలుమోపి పోర్చుగీసువారిని తరిమేశారు. కొంత కాలం తర్వాత బ్రిటిష్‌వారు వచ్చి డచ్చివారికి అదే మర్యాద చేశారు. 20వ శతాబ్దం వరకూ వారి పాలన కొనసాగింది.

లవంగాలు, యాలకులు, జాజికాయ, జాపత్రి వంటి సుగంధ ద్రవ్యాలకోసమే క్రిస్టఫర్ కొలంబస్ అట్లాంటిక్ మహాసముద్రం దాటే సాహసానికి ఒడిగట్టింది. ఆయన చివరికి అమెరికా చేరాడు. తనకు తెలిసిన సుగంధ ద్రవ్యాలు అక్కడ ఆయనకు కనబడలేదు. కానీ మిరపకాయలు కనబడ్డాయి. కోకో విత్తనాలతో నిండిన ఒక నౌకను కొలంబస్ స్వాధీనం చేసుకున్నాడుగానీ అప్పుడు ఆయనకు దాని వాడకం తెలియలేదు. తర్వాత మిరపకాయలు, కోకో... వెస్లీలో, యూరప్‌లో ప్రవేశించాయి. సుంగధ ద్రవ్యాల రవాణా ప్రపంచం మొత్తాన్ని చుట్టడం ప్రారంభమైంది.

ఇప్పుడు సుగంధ ద్రవ్యాల వాణిజ్యంలో ఆనాటి లాభాలు లేవు. మలక్కాపై పట్టుకోసం యూరోపియన్లు నిర్మించిన సింగపూర్ నగరం ఇప్పుడు డబ్బులతో, ఐటితో వ్యాపారం చేస్తుంది. కానీ సుగంధ ద్రవ్యంలో కాదు. ఒకప్పుడు చాలా అరుదుగా దొరికిన సుగంధ ద్రవ్యాలు ఈ రోజు ఏ సూపర్ మార్కెట్‌లో చూసినా కనిపిస్తాయి. అయితే, ఆ రుచులు, ఆ సువాసనలు మనుషులను ప్రభావితం చేయడం మాత్రం ఎప్పటికీ తగదు.

★

రాళ్ల రైలు

హాయ్ బుజ్జాయిలూ... మీకు ఏదైనా కొత్త బొమ్మ చేయడమంటే చాలా ఇష్టమంటకదా. అందుకే ఈ వారం మీకోసం రాతి రైలు తీసుకొచ్చాం. తక్కువ ఖర్చుతో ఎంచక్కా చేసేయొచ్చు. మరి రెడీనా!

చేసేద్దాం

ఏమేం కావాలంటే...

ఆరు నున్నటి రాళ్లు.
అందులో ఒకటి పొడవుగా వుండాలి.
నిండు రంగులు,
పెయింట్ బ్రష్,
మట్టి.

ఎలా చేయాలంటే...

ముందుగా రాళ్లకు రంగులు వేయాలి. ఒక్కో రాయికి ఒక్కో రంగు. తర్వాత బొమ్మలో చూపించినట్టుగా.... ఒక్కో రాయిమీద తెలుపు పెయింట్‌తో బాక్సులు వేయాలి. రాళ్ల రైలు పెట్టెలనుకొంటే... ఆ తెలుపు బాక్సులు కిటికీలన్నమాట. ఆ ... అన్నట్టు పొడవు రాయి మీద ఎరుపు రంగు అద్దాలి. మట్టి సాయంతో... దీనిని మాత్రం మొదటి రాయిపైన అతికించాలి. ఇది రైలు పొగ గొట్టం అన్నమాట. అలాగే మట్టితో రైలు చక్రాలు తయారుచేయాలి. వీటిమీద రైలు పెట్టెలను వరుసగా నిలబెట్టాలి. చూడ్డానికి ఎంత బావుంటుందో.

ఇలా దీన్ని మీ టేబుల్ మీదో, షోకేస్‌లోనో పెట్టారనుకోండి. ఇంటికి వచ్చిన వారి చూపంతా అక్కడే ఆగిపోతుంది. తర్వాత చూసుకోండి! ఈ బొమ్మ ఎక్కడ కొన్నారంటూ ఒకటే ప్రశ్నలు వేస్తారు. కాస్త ఫోజు పెట్టాక అసలు విషయం చెప్పేయండే. మరి రాళ్ల రైలు చేసేస్తారుగా.







చుక్కలు కలిపేస్తే పోలా...

పూరించండి...

ఆర్టిస్ట్ అంకుల్ మీకు ఓ పరీక్ష పెడతారంట. మరి రాసేస్తారా! అయితే చూడండి. ఆయన నాలుగు మొహాలు వేశారు. అయితే అన్నీ సగం సగమే వేశారు. మిగతా సగం మీరు వేయాలి. అవతల సగం ఎలాగైతే వుందో అలా వేస్తే సరి. మరి ఆలస్యం ఎందుకంట.





ఏమేం ప్రాణులున్నాయి?

ఫ్రెండ్స్! ఇక్కడో విచిత్రమైన ప్రాణి కన్పిస్తోందా! అందులో నాలుగు రకాల ప్రాణుల శరీరభాగాలున్నాయి. మరి అవేంటో చెప్పుకోండి చూద్దాం.

జవాబు: తల-మొసలి, మెడ -ఉష్ణపక్షి, శరీరం-సీల్, తోక-ఉడుత.

మేం చెప్పిన రంగులు అద్దండే...



నేస్తాలూ... ఈ బొమ్మ రంగులు లేక వెలవెల పోతోందికదా. దానికి రంగులు అద్దేసి అదరగొడదామా! అయితే అక్కడున్న అంకెల దగ్గర దిద్దాల్సిన రంగులేంటో చూడండి. 1. ఇటుక రంగు 2. ఆకుపచ్చ 3. గులాబీ 4. నారింజ 5. ఎరుపు 6. బులుగు 7. పసుపు

c	o	a	t	a	j	s	e	m	s
e	d	l	o	n	u	c	x	s	o
s	r	o	b	e	m	a	s	a	c
t	e	w	i	h	p	r	y	m	k
e	s	t	a	p	e	f	k	s	s
o	s	y	c	s	r	o	e	h	i
r	p	g	u	j	t	v	m	o	t
a	r	o	g	b	o	o	w	r	e
y	r	e	j	l	p	v	e	t	a
t	l	y	g	l	h	a	t	s	d

ఆ తొమ్మిదీ ఎక్కడబ్బా...

నేస్తాలూ.... ఇక్కడ మనం ఉపయోగించే 9 రకాల వస్తువులు దాక్కున్నాయి. మీరు వాటిని గుర్తించి సున్నా చుట్టాలి.

సమాధానం: coat, dress, hats, gloves, jumper, scarf, shorts, tie, trousers.

తేడాలు కనిపెట్టండి

బుజ్జాయిలూ...కింద రెండు బొమ్మలూ చూడ్డానికి ఒకేలా వున్నాయా! అయితే పప్పులో కాలేసినట్టే. అందులో 10 తేడాలున్నాయి. మీరు వాటిని గుర్తించాలి.



మాటల కోట - 28

రూపకల్పన : వెంకట సుబ్బారావు కావూరి

1	2	■	3	4		■	5	6
7			■		■	8		
■		■	9		10	■		■
11	■	12			13	14	■	15
16			■	17	■	18		
	■	19	20	■	21		■	
■	22	■	23	24		■	25	■
26			■		■	27		28
29		■	30			■	31	

అడ్డం :

1. చిల్లు, చిల్లి, రంధ్రం, సందు (2)
3. ఆలోచన, కోరిక (3)
5. దారి మార్చిన నరుకు, తగ్గించు (2)
7. కొన్నిచోట్ల పులిబొంగరాలు, మరికొన్ని చోట్ల బోండాలు, ఇక్కడ ఇంకొక రకంగా.... పేరేదయినా మినప్పిండి, బియ్యప్పిండి, మిర్చి, ఉల్లిపాయతో నోరూరించే కమ్మని వంటకం (3)
8. చిట్ట చివర (3)
9. చదరంగంలో యుద్ధం చేసేవి ఇవే (3)
12. పొమ్మనలేక ఇది పెడతారని తెలుగు సామెత, ఆరోగ్యానికి ప్రమాదకారి (2)
13. చెక్కటానికీ, బొచ్చెలోకి ఎత్తటానికీ దీన్ని ఉపయోగిస్తారు (2)
16. అతి ప్రవర్తన, అవసరానికి మించిన కదలిక అటు నుంచి ఇటొచ్చింది (3)
17. కథకు(రాలు)డు చెబుతుంటే ఎదుటివారు కొట్టాల్సింది (1)
18. జ్ఞాపకం, నమూనా, ఆనవాలు (3)
19. మొత్తం (2)
21. లోపలి పదార్థం లేని గింజలు (2)
23. పొంచి ఉన్న ప్రమాదం (3)
26. వంతులు, భాగాలు (3)
27. ఈ లెక్కల సూత్రం ... కనిష్ట సామాన్య గుణిజం పొట్టయింది (3)
29. గురువే అయితే ఇది సినిమా సృష్టించిన పిలుపు (2)
30. జలుబుకు మిరియాలతో తయారు చేసే పానీయం తొణికింది (3)
31. అటు నుంచి కన్పిస్తోన్న సన్నని నూలు తాడు (2)

నిలువు

1. వాసన, కుళ్లుతో కలగలిసిన గాలి (2)
2. శరీరం (3)
4. అనావృష్టి, వానలు పడక పోవటం, సాగు, తాగునీటికి కటకట, పంటలు పండకపోవటం (3)
5. చెరువు (3)
6. కోరటమే (2)
9. తలకు చుట్టుకునే గుడ్డ (2)
10. కింద నుంచి పైకి పాకిన పశువుల ప్రసాదితమైన ఇది సంపూర్ణ ఆహారం(2)
11. కుండమీద పెట్టుకునేది. మట్టి తయారీ (3)
12. పశువుల్లో పాలు నిల్వ ఉండే అవయవం (3)
14. మండు, రాజుకొను, జ్వలించు (3)
15. కుమారుడు (3)
20. కింద నుంచి నాన్న సోదరి, భార్య తల్లి, మోడరన్‌గా ఆంటీ (2)
21. పిల్లలకు ఇష్టమైన చిరుతిండి (2)
22. నిలువుగా (3)
24. తాగేది, ద్రవపదార్థం (3)
25. నిలువు అయిదే(3)
26. పడమటి నుంచి తూర్పుకు ప్రవహించే చిన్న నది, వంకకు ముందుంటుంది (2)
28. కింద నుంచి కనపడకుండా ఉండటం (2)

మాటలకోట - 27 జవాబు

1 తీ	రం	■	2 క్ష	■	3 ద	య	■	4 ద
రి	■	5 టం	■	6 ఆ	■	■	7 వా	డి
8 క	9 ల	గూ	ర	గం	ప	■	■	గా
■	కా	■	■	త	■	10 అ	11 త	డు
12 వా	రం	■	13 లో	కు	14 వ	■	15 న	వా
యి	■	16 కం	■	17 దు	రు	వ	■	న
18 దా	వా	న	19 లం	■	ణ	■	20 వా	సి
సా	■	21 శు	గ	ణే	డు	■	22 ణి	రా
23 మ్ము	కా	■	రు	■	■	24 శ్రీ	శ్రీ	■

కోడిపుంజు - మణి


ఓసారి ఓ కోడిపుంజుకు బాగా ఆకలిగా వుంది. ఆహారం కోసం వెతకసాగింది.
షిట్...ఒక్క పురుగు కూడా కనిపించట్లేదే!
వా...వ్
హేయ్! అక్కడేంటి ఏదో కనిపిస్తోంది?
అదేంటో కనిపెట్టడానికి కోడిపుంజు అక్కడికి ఉత్సాహంగా వెళ్లింది.
ష్షు...ఇది కేవలం ఒక మణి!
అయినా ... ఈ మణి ఆకలిగొన్న కోడిపుంజుకు ఎందుకు పనికొస్తుంది? అదే మా యజమానికైతే ఉపయోగపడేది. చాలా సంతోషంగా తీసుకొనేవాడు. కానీ... నేను దీన్ని ఏం చేసుకొంటాను. విసిరికొడతాను.
ఇకనుంచి నేను ఈ మణులన్నిటినీ గింజలు కొనుక్కోవడానికి ఉపయోగించాలి కాబోలు!
నీతి: ఒకరికి గొప్ప నిధిలా కనిపించేది మరొకరికి పనికి రాని వస్తువుగా అగుపించొచ్చు.

అంత పే...ద్దది! ఇంత బుజ్జిది!

ప్రకృతిలో ఎన్ని వింతలో అనిపిస్తుంది అప్పుడప్పుడూ. మన కళ్లెదుట కనిపిస్తున్న గుర్రాలను చూస్తుంటే కూడా సరిగ్గా అదే మాట నోటెంట వచ్చేస్తుంది. చూడండి. ఒకటేమో ఇంత బుజ్జి గుర్రం. మరొకటేమో అంత పే...ద్ద గుర్రం. ఇవి రెండూ మామూలు గుర్రాలకు పుట్టినవే. కానీ ఎందుకీ తేడాలో తెలీదు. పెద్ద గుర్రం పేరు నాడీ. ఆస్ట్రేలియాలో పుట్టింది. ఇది స్వదేశంలోనే కాదండోయ్ ప్రపంచంలోని గుర్రాలన్నిటిలోకి పెద్దది. పుట్టినప్పుడు మామూలుగానే వున్నా...ఎదిగేకొద్దీ తనకంటూ ప్రత్యేకతను సంతరించుకొందీ అశ్వరాజం. ఇప్పటికే టీవీ షోల్లోను, దిన పత్రికల్లోనూ, మ్యాగజైన్లలోనూ వీక్షకులకు, చదువరులకు సుపరిచితురాలు. ఇక బుజ్జి గుర్రం సంగతి చూద్దాం. చూశారుగా! సరిగ్గా వారం రోజుల వయసున్న గొర్రె పిల్ల సైజులో వుంది. పుస్తకం కంటే కొంచెం పెద్దగా వుంది. అంతేనా! తల్లి పొట్ట కిందినుంచి దూరి వెళ్లగలిగేంత చిన్నది. తమాషాగా అన్పిస్తోందికదూ...!